సాగర్‌లో ఏపీ అధికారుల దౌర్జన్యం

- క్రస్ట్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జి తాళం ధ్వంసం
- మా పరిధే అంటున్న ఆంధ్రా ఉద్యోగులు

నందికొండ, ఆగస్టు 11 : నాగార్జునసాగర్ డ్యామ్ పైనుంచి క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన గేటు తాళాన్ని ఆంధ్రా అధికారులు ధ్వంసం చేశారు. క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లడానికి అనువుగా కొన్నేండ్ల క్రితం వాక్‌వే బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దానికి ఆంధ్రా, తెలంగాణ రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయగా నిర్వహణ పూర్తిగా తెలంగాణ అధికారులు చేపడుతున్నారు. ఆదివారం ఆంధ్రాకు సంబంధించిన సుమారు 20 మంది అధికారులు ఏపీ సీఎం పేషీ నుంచి వచ్చారు. వాక్‌వే బ్రిడ్జి గేట్‌కు తాళం వేసి ఉండటంతో తెలంగాణ ఎన్నెస్పీ అధికారులను తాళం చెవి అడిగారు. దాంతో వారు కొంత సమయం పడుతుందని చెప్పడంతో ఆంధ్రా అధికారులు దౌర్జన్యంతో గేట్ తాళం పగులగొట్టి వాక్‌వే బ్రిడ్జి మీదికి వెళ్లిపోయారు. 13వ గేట్ వరకు తమ ఆధీనంలో ఉన్నదంటూ తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని తెలంగాణ ఉద్యోగులు వాపోతున్నారు. డ్యామ్‌పై కంట్రోల్ రూమ్ 26వ గేట్ అవతల ఉన్నదని అక్కడికి వెళ్లి డ్యూటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫొటోలు, వీడియోలు ఉన్నతాధికారులకు పంపించినట్టు సమాచారం. ఈ ఘటనపై ఈఈ మల్లికార్జునరావును వివరణ కోరగా ఆంధ్రా అధికారులు తాళం పగులగొట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్యామ్‌పై పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆంధ్రా నుంచి ఎవరు వచ్చినా అనుమతిస్తున్నది.

ఉగ్రవాదులతో సైన్యం కుమ్మక్కు: ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్, ఆగస్టు 11: భారత సైన్యంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్ర ఆరోపణలు చేశారు. పెద్దయెత్తున భద్రతా దళాలు సరిహద్దుల వెంబడి మోహరించినా ఉగ్రవాదులు యథేచ్ఛగా భారత్‌లోకి చొరబడుతున్నారని, మనల్ని నాశనం చేయడానికి భద్రతా దళాలు వారితో కుమ్మక్కవుతున్నాయని ఆయన ఆరోపించారు. దీనిపై జమ్ముకశ్మీర్ డీజీపీ ఆర్‌ఆర్ స్వైన్ మాట్లాడుతూ దేశ, సరిహద్దు రక్షణలో ఇప్పటివరకు 7 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, మన సైనికులు శత్రుమూకలను ఎదుర్కోవడంలో ముందుండే దేశభక్తులని, అలాంటి వారిపై విమర్శలు శోచనీయమని అన్నారు.



ద్వీపకల్పాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతం పేరు సోమశిల. కృష్ణానదికి భారీగా వరద నీరు చేరడంతో శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ గుట్టల నడుమ చేరి ఇలా అందాలను తలపిస్తున్నది. టూరిజం కాటేజీలను తాకుతున్న కృష్ణా నది జలాలతో ఆ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నది. చూపరులకు అక్కడి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. - కపిలవాయి నాగరాజు, నాగర్‌కర్నూలు

సాగర్‌కు తగ్గిన వరద

8 గేట్ల ద్వారా నీటి విడుదల • జూరాలకు 65 వేల క్యూసెక్కులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 11: నాగార్జునసాగర్‌కు ఆదివారం 1,20,528 క్యూసెక్కుల వరద రాగా, 8 క్రస్ట్ గేట్లను ఎత్తి 63,120 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగాను ప్రస్తుతం 588 (306.1010 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. ఆదివారం సెలవు రోజు కావడంతో డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా జూరాల ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల వరద రాగా.. 3 గేట్లు ఎత్తి 62,725 క్యూసెక్కులను వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 89,417 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఆరు గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 2,28,634 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలకుగాను ప్రస్తుతం 199.7354 టీఎంసీలుగా ఉన్నది.



సాగర్ డ్యామ్ వద్ద పర్యాటకులు

మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌కు ఆదివారం 3,41,350 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. దీంతో మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు 4,500 క్యూసెక్కుల నీరును వస్తుండగా, 66 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద తగ్గుతున్నది. ఎగువనుంచి 4,39,600 క్యూసెక్కుల వరద వస్తుండగా 59 గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది ఆదివారం సాయంత్రం 3.41 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, ఆదివారం 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ ఆదివారం 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. కాగా, ఆదివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 13.2 టీఎంసీలకు పైనే జలాలు మధ్యమానేరుకు తరలించినట్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లాలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయక సాగర్‌కు వదులుతున్నారు.

కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ)/కొప్పల్: కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. శనివారం రాత్రి చైన్ లింక్ తెగిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. కొట్టుకుపోయిన గేటుపై ఒత్తిడిని తగ్గించేందుకు అధికారులు మరో ఏడు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నది. కొట్టుకుపోయిన గేటుకు మరమ్మతు పనులను చేపట్టాలంటే 60-65 టీఎంసీల నీటిని అత్యవసరంగా కిందకు విడుదల చేయాలని కర్ణాటకలోని కొప్పల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడగి చెప్పారు. 20 అడుగుల మేర నీటిని వదిలిన తర్వాతే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కొప్పల్ దిగువ ప్రాంతాల ప్రజలకు కర్ణాటక అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు అప్రమత్తమై ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు సమీప ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	36.4°c	22.7°c
ఆదిలాబాద్	36.2°c	23.0°c
నల్లగొండ	32.0°c	23.6°c
మెదక్	35.5°c	22.9°c
ఖమ్మం	33.0°c	26.0°c
నిజామాబాద్	32.8°c	24.9°c
కరీంనగర్	32.0°c	25.0°c
మహబూబ్‌నగర్	31.2°c	23.1°c
వరంగల్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.0°c	27.0°c

మరో రెండు రోజులు వానలు

- ఏడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో రెండ్రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో ఉదయం ఆకాశం మేఘావృతమై, సాయంత్రం తర్వాత జల్లులు కురవవచ్చని అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని కుమ్రంభీం, మహబూబాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. కుమ్రంభీం జిల్లా తిర్యాలలో 5.65 సెం.మీ, మహబూబాబాద్ జిల్లా గార్లలో 5.47, జగిత్యాల జిల్లా పెగడపల్లిలో 4.95, సూర్యాపేట జిల్లా అనంతగిరిలో 4.26, పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 4.58, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 4.02, యాదాద్రి-భువనగిరి జిల్లా ఆత్మకూర్-ఎంలో 3.85, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో 3.67, మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 3.62, సిద్దిపేట జిల్లా నంగనూర్‌లో 3.42 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

సీతారామ ట్రయల్ సక్సెస్

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. ఈ నెల15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించి సీతారామ ప్రాజెక్టు రెండు, మూడు పంపుహౌస్‌లను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం వైరా మండలంలో నిర్వహించే రుణమాఫీ రైతుసదస్సులో కూడా సీఎం ప్రసంగిస్తారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పనులను తమ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా తీసుకున్నదని తెలిపారు. ఈ ప్రాజెక్టును రెండేండ్లలో పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతుల చిరకాల వాంఛ నెరవేరుతున్నదని అన్నారు. గోదావరి జలాలు నాగార్జునసాగర్ ఆయకట్టుకు చేరనున్నాయని వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చివరి భూములకు సాగర్ నీళ్లు రాని సమయంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి ఏన్కూరు ఎన్ఎస్‌పీకి అనుసంధానం చేసి 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని వెల్లడించారు.

పాలేరు వరకు గోదావరి జలాలు

సీతారామ ప్రాజెక్టు వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తుమ్మల చెప్పారు. ఉమ్మడి జిల్లా ఆయకట్టుకు కృష్ణా జలాలు సకాలంలో రాకపోతే ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో వైరా లింక్ కెనాల్ ద్వారా గోదావరి నీళ్లను అందిస్తామని వివరించారు. జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా రైతుల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వైరాలో నిర్వహించనున్న రైతు సదస్సు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భరోసా ఇచ్చేదెప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

నివేదిక అందజేస్తుందని, దాని ఆధారంగా అసెంబ్లీలో రైతుభరోసాపై చర్చ పెడతామని సీఎం ప్రకటించారు. కమిటీ ఏర్పాటు చేసి 40 రోజులైనా నివేదిక జాడ లేదు. రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లాలవారీగా తొమ్మిది సమావేశాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఇప్పటికి నాలుగు సమావేశాలు మాత్రమే నిర్వహించింది. జూలై 15న వరంగల్ సమావేశం నిర్వహించి ఆ తర్వాతే అపేసింది. అదే నెల 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సేకరించిన అభిప్రాయాలతోపాటు నాలుగు సమావేశాల్లో స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా మంత్రుల కమిటీ నివేదిక ఇస్తుందేమోనని అంతా భావించారు. కానీ, 15 రోజుల్లో ఇస్తారన్న నివేదిక అతీ గతీ లేకుండా పోయింది.

అసెంబ్లీలో చర్చ ఏమైంది?

రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ పెడతామని చెప్పిన ప్రభుత్వం.. సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. 11 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరిగితే ఒక్కపూట కూడా రైతుభరోసాపై ప్రభుత్వం చర్చించలేదు. ఈ నేపథ్యంలో రైతుభరోసాపై ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే.. మంత్రుల కమిటీ నుంచి నివేదిక తెప్పించుకొని, అసెంబ్లీలో చర్చ పెట్టి, విధి విధానాలు రూపొందించేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇవేవీ చేయకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

ఒక్కో వైన్స్‌కు అదనపు టార్గెట్ 50 లక్షలు!

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయమో, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఒత్తిడో తెలియదు కానీ, ఇటు మద్యం వ్యాపారులకు, ఎక్సైజ్ కిందిస్థాయి అధికారులకు అదనపు కష్టాలు వచ్చిపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా ఒక్కో లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల టార్గెట్లు పూర్తి కాలేదని, పై అధికారులు టార్గెట్లు పెట్టారని, వీలున్నంత మేర స్టాక్ తీసుకెళ్లాలని మద్యం దుకాణదారులపై నిత్యం ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలిసింది. మూడు నెలలుగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు నెలకు రూ.3 వేల కోట్లకు మించి జరుగుతున్నాయి. జూన్‌లో రూ.3,175 కోట్లు దాటింది. అయితే, జూలై నెలలో రూ.3 వేల కోట్లలోపే ఉండడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యం చేరాల్సిందేనని రిటైలర్లపై ఒత్తిడి పెంచినట్టు సమాచారం. 'గోదాముల్లో సరుకు రెడీగా ఉన్నది. ఈ నెలలో అమ్మకాల లక్ష్యం పూర్తి చేయాలి. ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. మందు కొంటారా? లేదా? ముందు ఎంతో కొంత సరుకు తీసుకెళ్లండి' అంటూ యజమానులకు ఫోన్లు చేస్తున్నారని తెలిసింది. దీంతో చేసేదేమీ లేక డీడీలు చెల్లించి స్టాక్ తీసుకెళ్తున్నారు.

రూ. లక్ష మద్యం కొంటే 15 శాతం నష్టం

జనాభా ప్రాతిపదికన శ్లాబ్ ప్రకారం టెండర్ దక్కించుకున్నా, నిర్ణీత కోటా అయిపోయిన తర్వాత తాము చెల్లించే మొత్తంలో సుమారు 15 శాతం నష్టపోవాల్సి వస్తున్నదని వైన్స్ షాప్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ప్రాంతంలో రూ.50 లక్షల శ్లాబ్‌లో టెండర్ దక్కించుకున్న వ్యాపారికి పదిసార్ల వరకు ఐఎంఎల్ డిపోలో కొనుగోలు చేసిన మద్యానికి ఎలాంటి అదనపు పన్ను ఉండదు. అంతకుమించి కొనుగోలు చేస్తే రూ. లక్షకు దాదాపు 15 శాతం అంటే రూ.15 వేలు అదనంగా పన్ను రూపంలో చెల్లించాలి. దీంతో పాటు అమ్మకాలు లేని సమయంలో కొనుగోలు చేయాల్సి రావడం తమకు తలకుమించిన భారంగా మారిందని, వడ్డీలకే డబ్బు సరిపోని పరిస్థితి ఉందని వైన్‌షాప్ యజమానులు వాపోతున్నారు. 'ఒక్కో షాపునకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అదనంగా మద్యం కొని అమ్మాలట. ఇట్లైతే మేం మందు అమ్మలేం సారు' అంటూ 'నమస్తే తెలంగాణ'తో ఓ మద్యం దుకాణదారుడు వాపోయాడు. అన్ని జిల్లాల్లోనూ ఇదే తరహా టార్చర్ ఉందని తోటి వ్యాపారులు కూడా చెప్తున్నారని పేర్కొన్నాడు.

బెల్టుషాపుల్లో ఏరులై పారుతున్న మద్యం

ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి, వడ్డీలకు తెచ్చిన డబ్బులు చెల్లించడానికి తప్పని పరిస్థితుల్లో బెల్టుషాపులకు అడిగినంత మందు ముట్టజెప్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఏ గ్రామంలో చూసినా మద్యం ఏరులై పారుతోంది. ఆఖరికి గ్రామాల్లోని కిరాణా షాపుల్లో సైతం మద్యం దొరుకుతున్నదంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒకరిని చూసి మరొకరు కొత్త బెల్టుషాపులకు తెర తీస్తున్నారు. వీటిపై ఎక్సైజ్, పోలీసుశాఖలు పూర్తిగా నియంత్రణ కోల్పోయాయి. ప్రభుత్వ లక్ష్యం నేరవేరేందుకు వారు సైతం బెల్టుషాపుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికారంలోకి రాగానే బెల్టుషాపులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వం ఆ హామీని ఏం చేసిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో మద్యం విక్రయాలు జరుపగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలన్నీ తుంగలో తొక్కి టార్గెట్ల పేరుతో మద్యం వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తున్నది.

డబ్బులివ్వకుంటే మీ కొడుకును కాల్చేస్తం

- భయపెట్టి దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు
- విదేశాల్లో అల్లర్ల ఆసరాతో ఫోన్‌కాల్స్
- నానారకాలుగా బెదిరించి డబ్బు డిమాండ్
- నమ్మి మోసపోతున్న తల్లిదండ్రులు
- అలాంటివాటికి స్పందించొద్దు : సైబర్‌క్రైమ్ పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : 'మీ కొడుకును మేం పట్టుకున్నం.. మాకు డబ్బులు పంపకపోతే కాల్చి చంపేస్తం' అంటూ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో బెదిరింపులకు దిగుతూ దోచేస్తున్నారు. లండన్‌లో కొంతకాలంగా జరుగుతున్న అల్లర్లను అడ్డం పెట్టుకొని తాము లండన్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ పాకిస్థాన్ కోడ్‌తో వచ్చే నంబర్లతో వాట్సాప్ కాల్స్ చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఎలాంటి ఘటనలు జరుగుతున్నా సైబర్‌నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటూ ఫోన్లు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తమ పిల్లలు చదువు, ఉద్యోగాల కోసం యూకేకు వెళ్లడంతో నిజంగానే వారు ఆపదలో చిక్కుకున్నారేమోనని తల్లిదండ్రులు భయపడుతూ నేరగాళ్లకు డబ్బు కూడా పంపి మోసపోతున్నారు. ఒకవేళ యూకేలో తమ పిల్లలు లేరని చెబితే ముంబయి, ఢిల్లీ ఇలా ఏదో ఒక ప్రాంతం పేరు చెప్పి ఆందోళన కలిగేలా చేస్తున్నారు. నేరుగా ఫోన్ చేసి బెదిరించే ముఠాలు కొన్నయితే, మరి కొన్ని ముఠాలు పోలీస్ దుస్తులు వేసుకొని 'మేం పోలీసులం మీ పిల్లలను పట్టుకున్నం' అంటూ వివిధ కేసుల వివరాలు చెబుతూ నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

వాట్సాప్ కాల్స్‌తోనే!

ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ చీటర్స్ ఎక్కువగా వాట్సాప్ కాల్స్‌తోనే మాట్లాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మొదట సాధారణ కాల్ చేసి డ్రగ్స్, మనీలాండరింగ్ నేరాలు జరిగాయంటూ బెదిరిస్తున్నారు. అలాంటి బెదిరింపులకు భయపడి స్పందిస్తే వెంటనే పోలీస్ అధికారి మాట్లాడుతాడంటూ మాట్లాడిస్తూ ఆందోళన కల్గిస్తున్నారు. 'మీవాడు కేసుల్లో ఇరుక్కున్నాడు.. మా అదుపులో ఉన్నాడు, డబ్బులివ్వకపోతే కాల్చేస్తాం.. మీ పేరుతో పార్సిల్ ఒకటి వెళ్తుంది.. అందులో మీ ఫోన్ నంబర్ ఉంటుంది. ఇది డ్రగ్ మాఫియా లింక్‌కు సంబంధముంటుంది.. దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌లతో మీకు సంబంధాలు అంటగడుతం' అంటూ బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. పోలీసులమని చెప్పుకొనే కొందరు వాట్సాప్‌లో వీడియో కాల్స్, స్కైప్ కాల్స్ చేసి ఓవైపు సహాయం చేస్తున్నట్టే నటిస్తూ మరోవైపు 'మేం ఆర్బీఐ, సీబీఐ, ఎన్ఐఏ వాళ్లం.. మీ బ్యాంకు ఖాతాలు విశ్లేషించాలి.. అందుకు మీ ఖాతాలోని డబ్బు ఆర్బీఐకి పంపించాలి' అని మోసం చేస్తున్నారు. అనుమానాస్పద నంబర్లు, ఇతర దేశాల కోడ్‌లతో వచ్చే కాల్స్‌కు ఎవరూ బెదిరిపోవద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

'మీ పిల్లలు డ్రగ్స్‌తో పట్టుబడ్డరు'

- డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే వదిలేస్తం
- సీబీఐ పేరిట బెదిరింపు కాల్స్
- నిర్మల్ జిల్లా భైంసాలో ఘటనలు

భైంసా టౌన్, ఆగస్టు 11 : 'మేం సీబీఐ పోలీసు లం. మీ పిల్లలు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డరు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలి' అంటూ కొన్ని రోజులుగా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంతో పాటు మండలంలోని పలువురికి సీబీఐ పోలీస్ పేరిట వాట్సాప్ కాల్స్ వస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం మండలంలోని ఇలేగాంకు చెందిన వెంకటేశ్ కాంబ్లేకు 'నీ కూతురు డ్రగ్స్ అమ్ముతూ దొరికింది. పది నిమిషాల్లో మా దగ్గరికి రావాలి' అని గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. ఆందోళనకు గురైన వెంకటేశ్ కాంబ్లే పాఠశాలకు వెళ్లి చూడగా అమ్మాయి క్షేమంగానే ఉన్నదని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నాడు.



కాల్స్ వస్తున్న నంబర్ డీపీ ఉన్న పోలీస్‌ఫొటో



బెదిరింపు కాల్ వచ్చిన వెంకటేశ్ కాంబ్లే

పట్టణంలోని భట్టిగల్లీకి చెందిన ఓ వ్యక్తికి కూడా ఫోన్ రాగా అతను డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమిచ్చాడు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వారి పేరు, తండ్రి పేరు, ఫోన్ నంబర్, ఊరి పేరు చెబుతూ ఫోన్ కాల్స్ చేస్తున్నారు.

గురుకులంలో గురువులేరి?

మొదటిపేజీ తరువాయి...

పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఒక్క కొడంగల్ బాలుర గురుకులంలోనే మొత్తంగా 22 పోస్టులు ఖాళీ పెట్టడం గమనార్హం. హైదరాబాద్, రంగారెడ్డితో పాటు పలు జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని గురుకులాల్లో కొన్ని గ్రూపులకు విద్యార్థులు లేకున్నా అక్కడ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు, లెక్చరర్లను నియమించటం విచిత్రం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని ఎస్సీ గురుకులంలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులున్నాయి. ఈ రెండు గ్రూపుల్లో విద్యార్థులెవరూ లేకపోయినా అన్ని సబ్జెక్టులకు జేఎల్స్‌ను నియమించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, నల్లగొండ జల్లా తిప్పర్తి, అనుముల, నకిరేకల్ గురుకులాల్లోనూ ఇదే పరిస్థితి.

పేర్లు లేకుండానే ఉత్తర్వులు!

ప్రభుత్వం ఒక ఉత్తర్వు ఇవ్వాలంటే కచ్చితంగా ఒక ఫైల్ మూమెంట్ తర్వాత, అప్రూవల్ అయిన తర్వాత ఆ ఫైల్ నంబరు, ప్రొసీడింగ్స్ నంబర్‌ను మెన్షన్ చేస్తూ బదిలీగానీ, ప్రమోషన్ ఉత్తర్వులుగానీ, నూతన నియామక ఆదేశాలు గానీ ఇవ్వాలి. అలా ఇచ్చిన ప్రతి ఉత్తర్వు మీద జారీచేసిన అధికారి పేరు, హోదాను పేర్కొనటం సంప్రదాయం. అప్రూవల్ కాపీలలో ఉండే ప్రొసీడింగ్స్ నంబర్స్ ఆధారంగా ప్రతి ఉద్యోగి వివరాలు వారివారి సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేస్తుంటారు. కానీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లో అందుకు పూర్తి విరుద్ధంగా ఒక విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ఒక కార్పొరేట్ సెక్టార్‌లో సర్టిఫికెట్ ఇచ్చినట్టు మాదిరిగా ప్రమోషన్, బదిలీ, నూతన నియామక ఉత్తర్వులను జారీచేయటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఒకే ఉద్యోగికి అన్ని జోన్లలో..!

ఆర్ట్ విభాగానికి సంబంధించి జోన్-3లో ఉన్న ఓ ఉద్యోగిని తొలుత జోన్-5కు బదిలీ చేశారు. ఆ వెంటనే జోన్-4కు బదిలీ చేసి మళ్లీ జోన్-3లోనే పోస్టింగ్ ఇచ్చారు. మళ్లీ రాత్రికిరాత్రే సదరు ఉద్యోగిని జోన్-1కి, ఆ మరుసటి రోజున అక్కడి నుంచి జోన్-2కు మారుస్తూ పోస్టింగ్ ఇచ్చారు. చివరికి ఇటీవల తిరిగి జోన్-5కు సదరు ఆర్ట్ టీచర్‌ను బదిలీ చేశారు. ఇదొక్కటే కాదు ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీ పీడీ (ఫిజికల్ డైరెక్టర్) బదిలీల జాబితాను సైతం 3 సార్లు మార్చారు. మహిళా గురుకులాల్లో పురుషులకు పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధన పెట్టుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా పలువురికి మహిళా గురుకులాల్లో పోస్టింగ్ ఇచ్చారు. అంతేకాదు ఫోకల్ టు ఫోకల్ బదిలీ ఇవ్వకూడదు. ఆ నిబంధనకూ అధికారులు పాతరేశారు.

మైనార్టీ గురుకులంలో..

మైనార్టీ గురుకులాల్లోనూ ప్రమోషన్లు, బదిలీల ఉత్తర్వుల్లో గందరగోళమే. మొదట వెబ్ కౌన్సెలింగ్ అని చెప్పి తర్వాత మాన్యువల్‌గా మార్చారని, లాంగ్ స్టాండింగ్ ఉన్నవారికి సేమ్ ప్లేసెస్‌లో ప్రమోషన్లు ఇవ్వటాన్ని తప్పుబడుతూ కోర్టుకు వెళ్లిన వారికి కక్షసాధింపుగా ప్రమోషన్లను నిలిపివేశారని సొసైటీ ఉన్నతాధికారుల తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్సీ బాటనీ చేసిన వారికి జేఎల్ జువాలజీలుగా పదోన్నతి కల్పించారంటే సొసైటీలో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోచ్చని ఉదహరిస్తున్నారు. ప్రమోషన్ తీసుకున్న ఉద్యోగులకు 24 గంటలు గడిచేలోగానే రివర్షన్ ఉత్తర్వులు ఇస్తున్న దుస్థితి నెలకొన్నది.

బీసీ వెల్ఫేర్‌లోనూ..

బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో)ల బదిలీలను చేపట్టారు. ఇందులో 100కు పైగా పోస్టులకు పైరవీలతో పోస్టింగ్ ఇచ్చారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. నాలుగేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులను తప్పనిసరి బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే 15 ఏండ్లుగా ఒకే దగ్గర ఉద్యోగం చేస్తున్న వారిని బదిలీ చేసినట్టే చేసి, మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వటమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఏడో జోన్ పరిధిలోని ముగ్గురు ఉద్యోగులను బదిలీ చేయకపోవటంలో అక్రమాలు జరిగినట్టు అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఇక, గ్రేడ్-2 వార్డెన్లకు ఇటీవల బదిలీల ప్రక్రియలో సీనియార్టీ జాబితాను 2 సార్లు మార్చారు. స్పౌజ్ కేసుల విషయంలో వెసులుబాటు ఉన్నా ఆ విషయాన్ని విస్మరించి ఇష్టానుసారం బదిలీలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



తప్పులు సరిచేస్తున్నాం

మైనార్టీ గురుకుల సొసైటీ బదిలీలకు తొలుత వెబ్ కౌన్సిలింగ్ అని చెప్పే ఆప్షన్స్ తీసుకున్నాం. ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు రావటంతోనే మాన్యువల్‌గా నిర్వహించాం. ప్రధానంగా 317 జీవో డిస్‌లోకేటెడ్ సిబ్బంది ఉన్న చోట ఇబ్బందులు వచ్చాయి. సదరు సిబ్బంది ఉన్న పోస్టులను కూడా ఖాళీలుగా చూపటంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జరిగిన లోపాలన్నింటినీ గుర్తించి సరిచేస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా న్యాయం చేస్తున్నాం.

- ఆయేషా మస్రత్ ఖానమ్, సెక్రటరీ, మైనార్టీ గురుకుల సొసైటీ


చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

మహాకవి పోతన మరో కోణం

జిలుగు వెలుగుల తెలుగు సాహిత్య ప్రపంచాన పండిత పామర జనరంజకంగా శ్రీమదాంధ్ర మహా భాగవతంను రచించిన ప్రజాకవి, భక్త కవి, సహజ పండితుడు బమ్మెర పోతనామాత్యుడు. వారు 'శ్రీకైవల్య పథంబు చేరుటకునై చింతించెదన్' అంటూ శ్రీమదాంధ్ర మహా భాగవత గ్రంథాన్ని ఆరంభించారు.

ఒకప్పుడు పోతన పద్యం ఒకటన్నా రాని తెలుగువారు ఉండేవారు కాదనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. పోతన పద్యం ఒకసారి అలా వింటే చాలు.. ఇలా వచ్చేస్తుంది. అల వైకుంఠపురిలో అంటూ అలా అలా పోతన పద్య లోకాలలోకి వెళ్లి పోవచ్చని కొందరంటారు. పామరులు సైతం పోతన 'నల్లనివాడు పద్మ నయనంబులవాడు... సిరికింజెప్పడు.. ఇందు గలడందు లేడని సందేహము వలదు.. కారే రాజులు రాజ్యముల్ గల్గవే..' అంటూ పాడుకునేవారు.



నాడు బడుల్లోనే కాదు గుడుల్లోనూ ఏదో ఒక పోతన గారి భాగవత పద్యం విన పడేది. ఇక హరికథల్లో, బుర్రకథల్లో, ఒగ్గు కథల్లో పోతన పద్యం కళకళలాడుతుండేది.

ఈ కాలంలో పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుకు నేవారు సైతం పోతనగారి పద్యాలు కనీసం ఒక్క టన్నా చెప్పలేకపోతున్నారు. పద్యాలను పరీక్షలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటంటే పురాణ కథలు తెలుసుకోవడానికి పద్యాలు ఎందుకండి? మామూలు భాషలోనే తెలుసుకోవచ్చు గదా? అని నేటి తరం విద్యార్థులు అధిక శాతం మంది అంటారు.

'పద్యం తెలుగువారి ఆస్తి. పద్యం పాడుకోవడానికి బాగుంటుంది' వంటి మాటలు సాహిత్య సభలలో చెప్పుకోవడానికి బాగానే ఉంటాయి కొందరు ఆధునికులు 'అ.. పద్యాలు ఎవరికి అర్థమవుతాయండి. నేటి సైన్స్ అండ్ మ్యాథ్స్ అర్థం చేసుకోవడానికే పిల్లలకు సమయం సరిపోవడం లేదు అంటారు.

ఇలాంటి నేపథ్యంలో పద్యం చదవడం, అది రాయడానికి ఛందస్సును నేర్చుకోవడం ఇదంతా అవసరమా? అని కొంత మందికి అనిపిస్తుంది. ఇదిలా ఉంటే పద్యాల్లో కంద పద్యానికి చాలా నియమాలు ఉంటాయి. వాటితో కందపద్యం రాసినవాడే నిజమైన కవి అని పద్యకవులు అంటారు.

> మహాకవి పోతన అనగానే సాహిత్య ప్రియులకు సర్వ లఘు కందపద్యం గుర్తుకువస్తుంది. అది..
> **అడిగెదనని కడు వడి జను**
> **నడిగిన దను మగుడ నుడువనని నడయుడుగన్**
> **వడి వడి జడిముడి తడబడ**
> **నడుగిడునడుగిడదు జడిమ నడుగిడునెడలన్**

శబ్దాలంకార సొబగులతో సాగే ఈ పద్యం తెలుగు సాహితీవన మకరందం. పద్యాభిమానుల హృదయాలను పరవశింపజేసే అమృతసాగరోద్భవ లక్ష్మీ చిరు దరహాస కుసుమం.

> **అయితే ఈ పద్య మూలాల్లోకి వెళ్తే పోతనగారి గణిత పాండిత్యం ఎంత ఉన్నతమైనదో తెలుస్తుంది. ఆ ఉన్నత గణితాన్ని చక్కగా చెప్పగలిగితే నేటి విద్యార్థులు సైతం ఆకర్షితులవుతారు. పద్యం వైపునకు కదులుతారు.**

కంద పద్యంలో చతుర్మాత్రా గణాలను వాడతారు. అవి నల, గగ, భ,జ,సలు. పోతనగారు పై పద్యంలో 2, 4 పాదాల చివర సగణం వాడి మిగతా గణాలన్నిటిని నలములను వాడారు. కంద పద్యానికి సంబంధించిన ప్రాస యతులను పాటించారు. బేసి గణ ధర్మాలను 6వ గణ ధర్మాన్ని పాటించారు.

కంద పద్యంను రెండు భాగాలుగా విభజిస్తే మొదటి భాగంలో మూడు గణాలతో ఒక పాదం, ఐదు గణాలతో ఒక పాదం ఉంటుంది. ఇలా ఒక్కొక్క భాగం 8 గణాలతో కంద పద్యంలో రెండు భాగాలు ఉంటాయి.

పోతన రాసిన సర్వలఘు కందంలో మొదటి పాదం.. 3 గణాలు నలములే. రెండవ పాదం అయిదు గణములలో 4 నలములు 1 సగణం 4+1 అలాగే మూడు నాలుగు పాదములు 3 4+1 ఆధునిక గణితాన మాత్రికా పద్ధతిన దీన్ని కిందివిధంగా రాయవచ్చు. (3 (4+1)) (3 (4+1)) మాత్రికల్లో ఈ సంఖ్యలను మూలకాలని అంటారు. ఇక్కడ 1,3 మూలకాలు ఒక రీతిలోనూ 2, 4 మూలకాలు ఒక రీతిలోనూ ఉన్నాయి.

కంద పద్యంను ఇలా కాకుండా కంద పద్య నియమాలకు అనుకూలంగా, నల, గగ, భ,జ,స అనే గణాలన్నింటిని వాడుతూ కంద పద్యం రాస్తే ఇలాంటి మాత్రికా గణితంలో కంద పద్యం ఇమడదు. అలా ఇమిడేటట్లు పోతనగారు సర్వలఘు కంద పద్యం రాశారు. ఇలా ఈ పద్య మాత్రికల సంకలన వ్యవకలన గుణ భాగహారాలు తదితర గణ మూలాలనుంచే మన మహర్షులు, కవన మూలాలెరిగిన మహానుభావులు బీజాక్షరాలను, తదితర గణాక్షరాలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా కవన ప్రపంచంలో మహాకవి కాళిదాసు కవిత్వంలోనూ, మహాకవి పోతన కవిత్వంలోనూ ఇంకా ఇలాంటి కొందరి మహానుభావుల కవిత్వంలోనూ కొన్ని బీజాక్షరాలు ఉన్నాయని కొందరు సాహితీ ఉపాసకులంటారు.

వేదవేదాంగ పురాణేతిహాస ప్రబంధాదుల లోని మంత్ర బీజాక్షరాలు మాయలు కాదు. మర్మాలు కాదు అనేకానేక గణిత గుణ మూలాలు. ప్రకృతి, భాషా గణన ప్రసాదించిన గణిత మేధో విన్యాసాలు. మన పూర్వికులు గణిత సంబంధ విషయాలను సైన్స్ సంబంధ విషయాలను దైవాంశ తేజాలుగా భావించారు. అలా భావించడంలో తప్పు లేదు. ఎందుకంటే అవి దైవంలా శాశ్వతాలు. నిరంతరం పదుగురికి ఉపయోగపడే పరోపకార విజ్ఞాన గుళికలు.

ఆ గణిత మూలాలను తెలుసుకోవాలంటే వేద ఛందో మూలాల్లోకి వెళ్లాలి. అదీ ఆధ్యాత్మిక పథంలో, మానసిక వికాస కళాపథంలో కాక సశాస్త్రీయ పథంలో వెళ్లాలి. ఇక ఆధునిక గణిత శాస్త్రవేత్తలు మరో మార్గం ద్వారా ఇక్కడికే వస్తున్నారు. తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. ఇక్కడి గణితం కూడా చిన్న చిన్న మార్పులతో ఆధునిక గణిత ఛాయలతోనే ప్రకాశిస్తుంది.

> **మహాకవి పోతనగారు తమ భాగవతంలో కేవలం పురాణ కథలను చెప్పడానికే ప్రయత్నించలేదు. ఆయా పద్య లక్షణాల మూలల గణ చక్రాల నెరిగి పద్య ప్రయోగం చేశారు. గణంలోని గణిత చక్రాల స్వరూపాన్ని కొంత ఔపోసన పట్టారు. అంత మహోన్నత పద్య రచన చేశారు. ఆ గణ చక్రాలలోని గణిత చక్రాలను బహిర్గతం చేయగలిగే పోతనగారి గణిత సామర్థ్యం సామాన్యం కాదనిపిస్తుంది.**

ఇక ఆధ్యాత్మికంగా చెప్పాలంటే, 'అడిగెదనని కడు వడి జను...' అను సర్వ లఘు కంద పద్య భాగంలో మొత్తం 8 గణాలుంటాయి. ఇలా పద్యంలో రెండు భాగాలుంటాయి. ఈ పద్యం లక్ష్మీదేవికి సంబంధించినది. ఇక్కడ 8 గణాలలో 8 మంది లక్ష్మీదేవులు అనగా అష్ట లక్ష్ములున్నారు. 8వ గణం చతుర్మాత్రా గణమైనప్పటికీ అది మూడక్షరాల గణం. దీని మాటు మహా పరమార్థం ఉంది అని ఇలా ఆధ్యాత్మికంగా ఎంతైనా చెప్పవచ్చును. ఇది ఆధ్యాత్మికవేత్తలను, సుకవులను, పద్యకవులను ఆనందింపజేస్తుంది కానీ విద్యా ప్రపంచానికి ఉపయోగపడదు. ఇలా పోతనగారి శ్రీమదాంధ్ర మహా భాగవతము లోతులకి వెళ్లిన కొద్దీ మహదానందం కలుగుతుంది. మహాకవి పోతనగారి మీద అభిమానం పెరుగుతుంది.

అయితే మహాకవి పోతనగారి గణిత గుణాలను తెలుసుకుంటే బ్రహ్మానందం కలుగుతుంది. ఇలాంటి మహాకవి పోతనను నేటి ప్రపంచానికి తెలియచేయగలిగితే ఆధునిక విద్యా ప్రపంచం సైతం పోతనను కళ్లకద్దుకోవడమే కాదు, వారిని తమ మెదడుకు అద్దుకుంటుంది.



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు
98494 48947



వాన పర్వం

మేఘాలు వలలు విసిరాయా
చినుకులు గాలాలు వేసాయా
మనిషి
చేపపిల్లలా చిక్కుకుపోయాడు!

వాగులు స్థానబలం చూపాయా
చెరువులు నిండుకుండలయ్యాయా
మనిషి
కాగితం పడవలా కొట్టుకుపోయాడు!

ఉరుములు గర్జించాయా
మెరుపులు తళుక్కుమన్నాయా
మనిషి
గుండె చేత పట్టుకుపోయాడు!

మానవ భారతంలో
ఎన్నెన్నో ప్రకృతి పర్వాలు,
జీవితకాలంలో
ఎన్నెన్నో వికృతి దృశ్యాలు!

వానొచ్చినా
వడగాల్పొచ్చినా,
మనిషి మాత్రం
ఋషిలా నిలవడటం నేర్చుకోవాలి!



పుట్టి గిరిధర్
94949 62080

ఎన్నో రాత్రులు మేలుకుంటే తప్ప ఈ దళితోద్యమ అఖండ చరిత్ర బయటికి రాదు. ఒక చరిత్రను బయటికి తేవడం తేలికైన పని కాదు. కొలిమిలో కాలిన కర్రుకు తెలుసు బాధేంటో.. పొలాన్ని పొతం చేసి పంటను నిలబెట్టిన నాగలికి తెలుసు కష్టం ఎంతనో.. అలాగే ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' వెనుక ఉన్న కృషి ఎంతటిదో సంగిశెట్టి శ్రీనివాస్‌కే తెలుసు.

దళిత వికాస సింగిడి




మన మైదానం ఖాళీగా లేదు, మనం రాయకపోవడమే ఖాళీ.. ఇక్కడ అస్తిత్వం కోసం పోరాడని వీరులు వీరవనితలు, గెలువని క్రీడాకారులు లేరు. కాకపోతే, చరిత్ర రాయలేదంతే. అక్కడక్కడా రాసినా వెలుగులోకి రానీయలేదు. బండారు అచ్చమాంబ కథలు, సురవరం కవిత్వం, సురమౌళి కథలు, సుషుప్తి మాదిరెడ్డి నవల, ఇందుమతి కవిత్వం, తెలంగాణ విస్మృత వీరుడు కేవల్ కిషన్... తెలంగాణ చారిత్రక పత్రాలు.. ఇలా ఎన్నింటినో పరిశోధించాడు. ఎన్నో గ్రంథాలను వెలుగులోకి తెచ్చారుసంగిశెట్టి శ్రీనివాస్. కాలాన్ని బోనులో నిలబెట్టిన సంగిశెట్టి చారిత్రక సమగ్ర పరిశోధన చేశారు. ఆ పుస్తకమే 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'.

ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'. ఈ పుస్తకాన్ని మునివేళ్లతో పట్టుకొని చూడండి మన తాతలు, మన ముత్తాతలెందరో చరిత్ర మరుగున మట్టిలో కప్పేయబడ్డారనే విషయం అవగతమవుతుంది. ఏ మనువాదులు వాళ్లను అణగదొక్కారు? ఏ ఆధిపత్యవాదులు వాళ్లను హత్యచేశారు? వాళ్లు వీరులుగా కాకుండా కులవాదులుగా, అంటరానివారుగా ఎలా ముద్రవేయబడ్డారు, వెలివేయబడ్డారు? అలా అగ్రకుల సమాజం వెలేసిన విస్మృతుల చరిత్రనే విజయ గీతికగా, వీరచరిత్రగా 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' పుస్తకం మనకు కనిపిస్తుంది.

మనకు తెలియకుండానే మన మీద పసరు రుద్దినటువంటి ఒక నిచ్చెనమెట్ల కులవ్యవస్థ భావజాలానికి మనం బానిసలుగా ఉన్నాం. అదీ స్వతంత్రంగా, బలవంతంగా. రెండూ మన ముందున్నవి. మన చరిత్ర గురించి మనం తెలుసుకోవడమే మనందరి కర్తవ్యం.

> **మన పూర్వికులే ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'లో హీరోలు. నేలమాళిగలలో ఇంకిపోయిన దళిత సామాజిక సాంస్కృతికతను నిలబెట్టేందుకు చేసిన ప్రయత్నమే 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'. మూలాలను లోతుగా పరిశోధిస్తూ, విశ్లేషిస్తూ ఇప్పటికే ఎందరో చరిత్రలో సామాజిక వీరవనితల వీరులపై కప్పబడిన బూజును దులిపారు సంగిశెట్టి. కట్టి వేయబడిన ప్రాచీన తాళకట్టలను విప్పారు. బందీకాబడ్డ చరిత్రకెక్కదగ్గ వారందరినీ చరిత్ర శిఖరాగ్రాన నిలబెట్టేందుకు సంగిశెట్టి కృషిచేశారు.**

తెలంగాణ అస్తిత్వానికి పట్టం గట్టిన ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 'అన్నీ మేమే కనిపెట్టాం అన్నింటికీ మేమే ముగ్గు పోశాం' అని చెప్పుకొనే వాళ్లందరూ ఈ పుస్తకాన్ని పరిపూర్ణంగా చదువాలి.



ఈ పుస్తకంలో ప్రధానంగా ఆధునిక కాలం నుంచి తెలంగాణ సమాజంలో దళిత సమాజం ఎదిగి వచ్చిన తీరు చెప్పడమైంది. దళితులు క్రీడలు, జర్నలిజం, విద్య, వ్యాపారరంగాల్లో ఎదిగొచ్చిన తీరు, అందుకు వారు ఎదుర్కొన్న అవరోధాలు, వాటిని అధిగమించడంలో చూపిన ఓర్పు కూడా పూసగుచ్చినట్టు చర్చించారు సంగిశెట్టి.

హైదరాబాద్ నుంచి వలసపోయి విఖ్యాతులుగా వివిధ రంగాల్లో తెలంగాణ కేతనాన్ని దేశ విదేశాల్లో ఎగరేసిన న్యాయమూర్తి, పార్లమెంటేరియన్ రాజారామ్ భోలే గురించి, హెచ్.కె.ఆరా, కుమారిల స్వామి లాంటి అంతర్జాతీయ పెయింటర్ల గురించి, బొంబాయి చిత్రసీమలో సంగీతంలో తనదంటూ ముద్రవేసిన శంకర్ జీ గురించి ఇందులో రాశారు. యక్షగానాన్ని చిరస్మరణీయం చేసిన చిందు ఎల్లమ్మ గురించి కూడా ఈ పుస్తకంలో ఉండటం ముదావహం. చరిత్రకు అధిక ప్రాధాన్యం ఇస్తూనే స్ఫూర్తి ప్రదాతల గురించి రాయడం గొప్ప స్ఫూర్తిగా ఉన్నది.

హైదరాబాద్ రాజ్య దళిత సమాజంపై అంబేద్కర్ ప్రభావం, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా దళితులు ఎదిగి వచ్చిన తీరు, నిజాం ప్రభుత్వంలో దళిత ప్రాతినిధ్యం, బ్రిటిష్ వారి చేయూతను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. తెలంగాణ దళిత చైతన్యాన్ని, చరిత్రను రాసిపోసిన కల్లం ఈ పుస్తకం. సమస్త వికాస చరిత్రనంత రాసులుగా పోసి, చదువుకోవడానికి వీలుగా ఉన్న అత్యుత్తమ సమగ్ర గ్రంథమే ఈ తెలంగాణ దళితోద్యమ చరిత్ర.



వనపట్ల సుబ్బయ్య
94927 65358



విరిగిపోయిన పడవ

ఏ ప్రేమికుల గుర్తో,
ఎక్కడి ప్రయాణికుల కలనో,
విరిగిపోయిన పడవ
సముద్రం ఒడ్డున పడి ఉన్నది

అతడు నేను కవిని అని చెప్పుకోలేదు
బ్యాండేజీ మీద నెత్తురు కనిపించినట్టు,
అందరు అతని కళ్ళల్లో కవిత్వం చూశారు

యుద్ధాలు జరిగిన తర్వాత
అతడు కవిత్వం మానేసి,
మనుషులను ప్రేమించడం ముఖ్యమన్నాడు.

అతడు పుస్తకాలు ప్రచురించాడో
లేదో తెలియదు కానీ,
ఎవరూ పట్టించుకోని విరిగిన పడవను,
బాగుచేయడం మొదలుపెట్టాడు

ఖైదీలందరూ వాళ్ల వయసు మరిచిపోయి,
చాలా ఏండ్లు గడిచాయి.
వాళ్లు, జైలు గోడలు కూలడం కోసం,
చిన్నపిల్లల్లా, ఇప్పటికీ
కలలు గంటూ నిరీక్షిస్తున్నారు

ఎప్పుడో సూర్యుడు కిటికీ మీద,
పక్షులతో కలిసిపోతాడు
అతడు కవిత్వం రాస్తానని,
ఎప్పుడూ అనలేదు

చీకట్లో, తుఫానుకు ఎదురుగా వెళ్లి,
దీపాలు పెట్టడానికి
కొట్టుకుపోతుంటే తెలిసింది,
వెలుతురే అతడు రాసే కవిత్వమని!
ప్రయత్నమే దాని సౌందర్యమని!!



ఆశారాజు
93923 02245

సరిగ్గా 60 ఏండ్ల కిందట ఉమ్మడి ఏపీలోని పాఠ్య పుస్తకాల్లో పైడిమర్రి వేంకట సుబ్బారావు రాసిన 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞను ముద్రించారు. కానీ, రచయిత పేరును మాత్రం ముద్రించలేదు. రచయిత పేరు లేకుండానే 50 ఏండ్ల పాటు ప్రతిజ్ఞను పాఠశాలల్లో విద్యార్థులు ఆలపించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాతే పైడిమర్రి వేంకట సుబ్బారావు వంటి మహనీయులకు గుర్తింపు లభించింది.

మానవతావాది పైడిమర్రి




కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడ్డ అప్పటి తెలంగాణ ప్రభుత్వం పైడిమర్రి వేంకట సుబ్బారావు పేరును తెలంగాణ పాఠ్య పుస్తకాల్లో ప్రతిజ్ఞ ఎగువన చేర్చి ఆయనకు సముచిత ప్రాధాన్యాన్ని కల్పించింది. అంతేకాకుండా 5వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో ఆయన జీవిత వివరాలను పొందుపరచడమే కాకుండా, 2016లో పైడిమర్రి శతజయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించింది.

పైడిమర్రి గొప్ప దేశభక్తుడు. మంచి రచయిత. నీతి, నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగి. గొప్ప వైద్యుడు. మానవతావాది. 1916, జూన్ 10న నల్గొండ జిల్లాలోని అన్నేపర్తి గ్రామంలో పైడిమర్రి జన్మించారు. 1962లో విశాఖపట్నంలో జిల్లా ఖజానాధికారిగా పనిచేస్తున్నప్పుడు ఆయన ప్రతిజ్ఞ రాశారు. 1965 నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞగా ఆలపించబడుతున్నది. దేశానికి జాతీయ ప్రతిజ్ఞను అందించిన పైడిమర్రికి ఎటువంటి పురస్కారాలు దక్కలేదు. తెలంగాణ ప్రభుత్వ స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం కూడా 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఆయన జీవిత వివరాలని పొందుపర్చింది. పైడిమర్రి జీవిత చరిత్రను తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో వీజీఎస్ ప్రచురణ సంస్థ ముద్రించి పుస్తక రూపంలోకి తెచ్చింది. పైడిమర్రి పేరుతో హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌పై నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. అదేవిధంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పాఠ్యపుస్తకాల్లో పైడిమర్రి పేరును చేర్చవలసి ఉన్నది.

(ఆగస్టు 13న పైడిమర్రి వర్ధంతి)



యం.రాంప్రదీప్
94927 12836



చౌరస్తా!

నలుదిక్కుల నుంచి నలుగురొస్తే
ఒక గుంపు తోడైతది
తోడైన నాలుగు
ఆలోచనలకు తొవ్వైతది

ఇది చౌరస్తా!
ఎక్కడ మొదలైందో
బాల్యం మొదలైనట్టు...

బుడిబుడి అడుగులు ఏసి ఏసి
ఇప్పుడు ఇక్కడ నిటారుగా
నిలబడ్డాయి కాళ్ళు

ఎన్ని కుటుంబాల నిలయమిది
ఎన్ని స్నేహాల కలయిక

తీసివేత ఎరుగదు
అంతా కూడికనే...

నలుగురు మాట్లాడిన
మాటలు మూటలే

వెయ్యి ఏనుగుల బలమైతది
నాలుగు చేతులే
బోలెడన్ని చప్పట్లు!
నలుగురి ఆలోచనతోనే.
నాణ్యమైన ధర నిర్ణయమైతది!

ఇక్కడ అన్నీ అమ్ముకోవచ్చు
అన్నీ కొనుక్కోవచ్చు

నడుస్తూ నడుస్తూ చౌరస్తా
దొరికిందనుకో
అప్పుడు నీ రస్తా నీకు దొరుకుతది!

ఒంటరిగా ఉన్నవాడికి
జంట దొరుకుతది

అది బతుకైతది!
ఎవరిదైనా ఆ బతుకు బాగైతది!



కందుకూరి శ్రీరాములు
94401 19245

ఆవిష్కరణ..

దళిత సాహిత్య దళ నాయకుడు మద్దూరి నగేష్ బాబు జయంతి సందర్భంగా.. 2024, ఆగస్టు 15 గురువారం రోజున సాయంత్రం 5 గంటలకు ప్రకాశం జిల్లా ఒంగోలులోని 1వ పట్టణ పోలీసుస్టేషన్ దగ్గరలోని సీపీఐ ఆఫీసులో 'మద్దూరి నగేష్‌బాబు సమగ్ర కవిత్వం' పుస్తకావిష్కరణ సభ జరుగనున్నది. సభాధ్యక్షులుగా ఆత్మకూరి బాల చెన్నయ్య, ముఖ్య అతిథిగా ఆచార్య ఎం.ఎం.వినోదిని హాజరుకానున్నారు. వక్తలుగా డాక్టర్ ఖాజా, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, నూకతోటి బాబురావు, గంగవరపు సునీత, డాక్టర్ నూకతోటి రవికుమార్, ఎర్రాజాశాస్త్రి, సజ్జా వేంకటేశ్వర్లు, కత్తి కళ్యాణ్, శ్రీరామకవచం సాగర్, నబీ కె ఖాన్, డాక్టర్ బద్దిపూడి జయరావు, ఎన్.మోహన్‌కుమార్ ధర్మ, పల్నాటి శ్రీరాములు హాజరుకానున్నారు.

- నిర్వహణ: బహుజన కెరటాలు

నవల..

2024, ఆగస్టు 17 శనివారం రోజున ఉదయం 10 గంలకు తిరుపతిలోని 'ఛాంబరాఫ్ కామర్స్'లో కేవీ మేఘనాథ్‌రెడ్డి రాసిన 'పాయిదరువులు' నవల ఆవిష్కరణ జరుగనున్నది. ఈ కార్యక్రమంలో మధురాంతకం నరేంద్ర, పలమనేరు బాలాజీ, ఆర్‌సీకే రాజు, సీఎన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొననున్నారు. అందరికీ ఆహ్వానం.

- కేవీ మేఘనాథ్‌రెడ్డి

పుస్తకం..

2024 ఆగస్టు 18 ఆదివారం రోజున సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కవి, అనువాదకుడు, సినీ విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ రాసిన 'యాదోంకి బారాత్' పుస్తకం ఆవిష్కరణ కానున్నది. ఈ పుస్తకాన్ని రచయిత తండ్రి వారాల అంజయ్య ఆవిష్కరించనుండగా, చిరంజీవి ప్రద్యుమ్న తొలి ప్రతిని అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ఆత్మీయులు, స్నేహితులు, కుటుంబసభ్యులు హాజరుకానున్నారు.

- ఇందిరారాణి,
ప్రోజ్ పోయెట్రీ ఫోరం నిర్వాహకురాలు



రంగనాయకసాగర్‌లో గోదావరి జలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది విషప్రచారం

మొదటిపేజీ తరువాయి...

గోదావరి జలాలను హరీశ్‌రావు తిలకించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో 229 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. చెరో ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలకు ఈ రెండు పార్టీలు చేసింది గుండు సున్నా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎనిమిది సీట్లు ఇచ్చిన తెలంగాణ బీజేపీకి చేదు అయ్యిందని, ఆంధ్ర మాత్రం తీపి అయ్యిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను అరిగోస పెడుతున్నదని విమర్శించారు. రైతుబంధు రాక రైతులు, పింఛన్లు రాక అవ్వతాతలు అరిగోస పడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆడబిడ్డల పెండ్లికి, కల్యాణలక్ష్మి పేరుతో రూ.లక్ష, ఆడబిడ్డ కాన్పుకు పోతే కేసీఆర్ కిట్ ఇచ్చారని, నేడు కల్యాణలక్ష్మి లేదు, కేసీఆర్ కిట్టు లేదని పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2000కు పెంచారని, కాంగ్రెస్ ప్రభుత్వం పెంచకపోగా, ఉన్నదే ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో జూన్‌లోనే రైతుల ఖాతాలో రైతుబంధు వేశారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదని గుర్తుచేశారు. గల్లీగల్లీకి బెల్టుషాపులు పెట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే మద్యంపై ఈ బడ్జెట్‌లో రూ.7,500 కోట్ల అధిక ఆదాయం టార్గెట్ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, కడవేర్గు రాజనర్సు, ముల్కల కనుకరాజు పాల్గొన్నారు.

కవిత అంటే గౌరవం.. కేటీఆర్ అంటే ఇష్టం

- వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తపరిచిన బీజేపీ ఎమ్మెల్యే
- ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో పైడి రాకేశ్‌రెడ్డి



నిజామాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో చేసిన కీలక ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ముఖాముఖి ప్రశ్నలో కవిత, కేటీఆర్ ప్రస్తావన రావడంతో తన వ్యక్తిగత అభిప్రాయమని నొక్కి చెబుతూ కీలక ప్రకటన చేశారు. జైలులో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత త్వరగా విడుదల కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కవిత అంటే గౌరవం, కేటీఆర్ అంటే ఇష్టమంటూ తెలిపారు. 'ఆ బాధ రావొద్దు... వచ్చింది కాబట్టే నేను కుంటాను దేవుడు ఎంతో మందిని క్షమిస్తాడు... మా సోదరిని క్షమించమని కోరుకుంటా'నని చెప్పుకొచ్చారు. రాజకీయాలు, వ్యక్తిగతం వేర్వేరు అంటూ స్పష్టం చేశారు. కవిత ఇందూరు కోడలు అంటూ పేర్కొన్నారు. విధానపరంగా పోరాటం చేసేటప్పుడు రాజీలేదని బీజేపీ ఎమ్మెల్యే అంటూనే తన మనసులోనే భావాలను వ్యక్తపరిచారు. కన్నబిడ్డ ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నప్పుడు ఎవరికైనా బాధ ఉంటుందని పెద్దాయన ప్రత్యేక పరిస్థితుల్లో కవితను కలవలేక పోతున్నట్టుగా పైడి రాకేశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

బ్రాండ్ తెలంగాణను బలిపెట్టొద్దు

మొదటిపేజీ తరువాయి...

అమరరాజా వెళ్లిపోతానని చెప్పటం తెలంగాణ బ్రాండ్‌కు నష్టమని చెప్పారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ పాలసీలు ఉండాలని పేర్కొన్నారు.రాష్ట్రంలో రూ. 9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా అమరరాజా సంస్థను ఎంతో కష్టపడి ఒప్పించామని, ప్రభుత్వం మారిన తర్వాత ఆ సంస్థ ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు.సంస్థ విషయంలో కాంగ్రెస్ సర్కారు సానుకూలంగా స్పందించాలని సూచించారు. అమరరాజా సంస్థ తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే కొనసాగిస్తుందని ఆశిస్తున్నానని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బహ్రెయిన్ జైల్లో బందీగా సిరిసిల్ల వాసి

- నర్సయ్యను బంధ విముక్తం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి
- తాత్కాలిక పాస్‌పోర్ట్ జారీ కోసం విదేశాంగశాఖకు లేఖ
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి



హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): బహ్రెయిన్ జైల్లో చిక్కుకుపోయిన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన 62 ఏండ్ల మానువాడ నర్సయ్యను స్వదేశం రప్పించేందుకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భారత విదేశాంగ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విదేశాంగశాఖ మంత్రి ఎస్ జయశంకర్‌కు ఒక లేఖ రాశారు. పాస్‌పోర్ట్ సమస్యల కారణంగా నర్సయ్య బహ్రెయిన్ జైల్లో ఉన్నారని తెలిపారు. బతుకుదెరువు కోసం నర్సయ్య 1996లో బహ్రెయిన్ వెళ్లారు. అక్కడి 'ది అరబ్ ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీ'లో మూడేండ్లపాటు తాపీ మేస్త్రీగా పనిచేశారు. 1999 ఆగస్ట్‌లో వర్క్ పర్మిట్ ముగిసినా నర్సయ్య అక్కడే పని చేస్తూ ఉన్నాడు. పాస్‌పోర్ట్ గడువు కూడా 2001లో ముగియటంతో బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ రెన్యువల్ చేసింది. ఆ గడువు కూడా ముగిసిందని, అయితే నర్సయ్య తనవద్దనున్న పాస్‌పోర్ట్ పొగొట్టుకున్నాడు. వర్క్ పర్మిట్, పాస్‌పోర్ట్ లేకపోవటంతో అక్రమంగా తమ దేశంలో ఉంటున్నాడంటూ బహ్రెయిన్ పోలీసులు నర్సయ్యను అరెస్ట్ చేసి జైల్లో ఉంచారు. నర్సయ్య విషయమై అతని భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కుమారుడు బాబు ఆందోళన చెందుతున్నారని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. నర్సయ్యకు తాత్కాలిక పాస్‌పోర్ట్‌ను ఇచ్చే విషయంలో చొరవ చూపాలని విదేశాంగ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

నర్సయ్యను స్వదేశం రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించి పాస్‌పోర్ట్ జారీ అయ్యేలా చూడాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. నర్సయ్యను విడుదల చేసి భారత్‌కు పంపించాలంటే ఆయన భారతీయుడని తెలిపే ఆధారాలను బహ్రెయిన్ ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నర్సయ్య గుర్తింపును ధృవీకరించాలని బహ్రెయిన్ ప్రభుత్వ సంస్థ లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ అథారిటీ 2024 జనవరి 8న అక్కడి భారత రాయబారికి లేఖ రాసిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం తాత్కాలిక పాస్‌పోర్ట్ జారీచేస్తే బహ్రెయిన్ ప్రభుత్వం నర్సయ్యను డిపోర్ట్ చేసే అవకాశం ఉందని తెలిపారు. బహ్రెయిన్‌లోని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం సమన్వయం చేసుకొని నర్సయ్య విడుదలకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి పాత రికార్డులను పరిశీలించి నర్సయ్య చిరునామా కనుక్కొని సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల ద్వారా నివేదిక ఇవ్వాల్సి ఉందని, ఈ విషయంలో హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని కేటీఆర్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంతోపాటు రాష్ట్ర ఎన్నారై వ్యవహారాలశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను మరింత వేగంగా అయ్యేలా తన కార్యాలయ సిబ్బందికి కేటీఆర్ ఆదేశించారు.

బండీ.. రేవంత్ ప్రతినిధివా?

- బండి సంజయ్‌ను ఎర్రగడ్డ హాస్పిటల్‌లో చేర్చాలి
- అసమర్థులు, చదువురానివాళ్లు కేంద్రమంత్రులు
- తెలంగాణకు నయాపైసా తీసుకురాని దద్దమ్మలు
- పదేండ్ల అభివృద్ధికా.. కేటీఆర్‌ను అరెస్టు చేయాలి?
- బండిపై ధ్వజమెత్తిన బీఆర్‌ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి
- 10 శాతమైనా సర్పంచ్‌లను గెలవాలని సవాల్



హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): బండి సంజయ్ కేంద్ర మంత్రా? లేక కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధా? అని బీఆర్‌ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి నిలదీశారు. రేవంత్‌ను తిడితే కాంగ్రెసోళ్లే సరిగా పట్టించుకోవటం లేదని, కానీ బండి సంజయ్ న్యూఢిల్లీ నుంచి వచ్చి ఇక్కడ మాట్లాడాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. రేవంత్‌కు అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు బండి సంజయ్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అర్హత అయినా తెలుసా? అని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను రేవంత్‌రెడ్డి జైల్లో వేస్తారన్న బండి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌ను జైల్లో పెట్టకపోతే తాను యుద్ధం చేస్తానన్న బండి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఒక కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఇసుమంత అవగాహన లేకుండా, తెలివితక్కువతనంతో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. కేటీఆర్ ఏం తప్పు చేశారని జైల్లో పెడతారని నిలదీశారు. ఎంపీగా మసీదులు తవ్వాలె.. శవాలు తవ్వాలె.. లాంటి పిచ్చి మాటలు మాట్లాడితే పోనీలే అని అనుకున్నామని, కేంద్ర మంత్రి హోదాలోనైనా బుద్ధి తెచ్చుకొని జ్ఞానంతో మాట్లాడాలని చురక అంటించారు. లేకపోతే ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సిన అవసరం వస్తుందని ఎద్దేవా చేశారు.

కేటీఆర్‌పై ఏమైనా ప్రశ్నపత్రాల లీకుల కేసులున్నయా?

'జైల్లో వేయటం మంత్రులు, ముఖ్యమంత్రుల పనా? కేటీఆర్‌పై ఏమైనా పదో తరగతి ప్రశ్నపత్రాల లీకుల కేసులు ఉన్నాయా? ఎమ్మెల్సీలకు డబ్బులు ఇస్తే దొరికిపోయిన కేసులు ఉన్నాయా?' అని బండి సంజయ్‌పై శ్రీధర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మోదీ, జైశ్రీరాం నినాదాల వల్ల బండికి ఆ పదవి వచ్చిందని, అలాగని కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. పదేండ్లు రాష్ట్ర మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని.. రాష్ట్రానికి 3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 25 లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించిన కేటీఆర్‌ను అరెస్టు చేయాలని మాట్లాడటం ఎంత చిల్లర విషయమో తెలుసుకోవాలని మండిపడ్డారు. ఎంపీగా కరీంనగర్‌కు కనీసం ఒక్క కల్వర్టుకైనా నిధులు తీసుకొచ్చారా? అని బండిని నిలదీశారు. తమరు రాష్ట్రానికి ఏం చేశారో కనీసం ఐదు నిమిషాలైనా చెప్పగలరా? అని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నయాపైసా తీసుకురాని దద్దమ్మలు రాష్ట్ర కేంద్రమంత్రులు అని ధ్వజమెత్తారు. ఇద్దరు తెలివితక్కువ, అసమర్థులు, చదువురానివాళ్లు కేంద్ర మంత్రులుగా రాష్ట్రానికి భారంగా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

ఎమ్మెల్యేగా బండి ఓడిపోయింది బీఆర్‌ఎస్‌పైనే

బీఆర్‌ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ అన్న బండి వ్యాఖ్యలకు శ్రీధర్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేగా బండి సంజయ్ ఎవరి చేతిలో ఓడిపోయారు? అని ప్రశ్నించారు. 'బండి సంజయ్‌కు దమ్ముంటే కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పది శాతం సర్పంచులు, పంచాయతీ ఎన్నికలల్లో పది శాతం ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ సీటు గెలిపించాలి. కిషన్‌రెడ్డిని కూడా అడుగుతున్నా. దమ్ముంటే తన సొంత గ్రామంలో బీజేపీ అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపించాలి' అని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి మెప్పు పొందటం కోసం బీజేపీ నాయకులు ఎందుకు పాకులాడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో నితీశ్ నారా డిఫెన్స్ అలయన్స్ అయిందని, తెలంగాణలో బీజేపీ-కాంగ్రెస్ కూడా రేవంత్‌రెడ్డి, బీజేపీ అలయన్స్ అయ్యిందని ఆరోపించారు. బలమైన నిర్మాణం ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతి

రాహుల్‌గాంధీకి ఎక్స్‌వేదికగా కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నదని, దీనిపై సమాధానం ఉన్నదా? అని కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత రాహుల్‌గాంధీని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అదానీ, సెబీ చైర్మన్ ఇటీవల భేటీ కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాహుల్‌గాంధీ సైతం ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. పీఎం మోదీకి పలు ప్రశ్నలు సంధించారు. సెబీ సమగ్రత దెబ్బతిన్నదని, అదానీ అంశంలో జేపీసీ వేసేందుకు కేంద్రం ఎందుకు వెనకడుగు వేస్తున్నదని రాహుల్ ప్రశ్నించారు. ఆయా అంశాలను ఉటంకిస్తూ ఎక్స్‌వేదికగా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో అదానీ కోసం చురుగ్గా ప్రచారం చేస్తున్న సీఎం వల్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి కూడా రాజీ పడిందని పేర్కొన్నారు. అదానీకి తెలంగాణలో రెడ్ కార్పెట్ స్వాగతం ఎందుకు పలుకుతున్నారని, ఆ ద్వంద్వ ప్రమాణాలపై సమాధానం ఉన్నదా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. అదానీ, రేవంత్ రెడ్డి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. సెబీ చీఫ్ అదానీతో భేటీ కావడం షాకింగ్‌గా ఉన్నదని విస్మయం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉండే ఏజెన్సీ ద్వారా దర్యాప్తు చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

నిరసన తెలిపినందుకు మాజీ ఎమ్మెల్యేపై కేసు

మట్టెవాడ, ఆగస్టు 11: వరంగల్ ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కు తిన్న ఘటనను నిరసిస్తూ దవాఖాన ఎదుట ధర్నా చేసిన తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తోపాటు తొమ్మిది మందిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మూడురోజుల క్రితం ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కుతిన్న ఘటనను నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే నరేందర్ తన కార్యకర్తలతో దవాఖాన గేటు ఎదుట ధర్నా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నా చేసినందుకు మాజీ ఎమ్మెల్యేతోపాటు 34వ డివిజన్ కార్పొరేటర్ కుమారస్వామి, రవి, కొంగ రాజేందర్, ఎలగంటి సతీశ్, ఎలగంటి మధు, సీతారాం, బజ్జూరి వాసు, తోట స్రవంతిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో రైతు మృతి

ఇనుగుర్తి, ఆగస్టు 11: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో ఆదివారం విద్యుత్తు షాక్‌తో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన దర్శనం సోమయ్య (55) పొలంలో పనులు చేస్తుండగా బావి మోటర్ సర్వీస్ వైరు కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

గురుకులంలో విద్యార్థికి విద్యుత్తు షాక్

గోవిందరావుపేట, ఆగస్టు 11: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యార్థి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు.తాడ్వాయి మండలం బయ్యక్కపేటకు చెందిన నీరటి ముఖేశ్ కర్లపల్లి గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నాడు. మధ్యాహ్న భోజనం తరువాత కిటికీ చువ్వకు కట్టిన విద్యు త్ వైరును తాకడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి 108కు సమాచారం అందించగా, సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ములుగు దవాఖానకు తరలించారు.

జాతీయ పార్టీల కుట్రలను అడ్డుకుంటాం

- బీజేపీ కాంగ్రెస్.. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ
- రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం..షాడో పాలన
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేకానంద్, ముఠాగోపాల్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివా? కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రివా ? అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కే పీ వివేకానంద బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్నా.. సీఎం రేవంత్‌రెడ్డికి కోవర్టుగా పని చేస్తున్నావని ఆరోపించారు. ఈ విధంగా వ్యవహరించడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఉత్తరాల రాసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ లేకుండా చేయాలన్న కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు కలిసి బీఆర్‌ఎస్ పార్టీని లేకుండా చేయాలన్న ప్రయత్నాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి వారి మైత్రిబంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ ఎమ్మెల్యేను పొగిడారని, రేవంత్‌రెడ్డి కూడా ఏబీవీపీ నుంచి వచ్చినవాడేనని తెలిపారు. ఢిల్లీలో కుస్తీ చేసుకుంటూ, గల్లీలో దోస్తీ చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్, కేటీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అరెస్ట్ చేయాలి? అనడంపై మండిపడ్డారు. కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయాలి? హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా? లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చినందుకా? 25 లక్షల ఉద్యోగాలను అందించినందుకా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జాతీయ పార్టీల కక్షపూరిత రాజకీయాలను గమనిస్తున్నామని, ఇలాంటి కుట్రలను సహించేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో పెద్ద పెద్ద నాయకులను ఎదుర్కొన్నామని, ఈ నాయకులంతా కేసీఆర్ కాలిగోటికి సరిపోరని విమర్శించారు. ఢిల్లీకి కప్పం కట్టే రాష్ట్ర నాయకత్వంలో పాలన గాడి తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని కుంభకోణాలేనని, ఒక వైపు లిక్కర్ మాఫియా, మరో వైపు ఇసుక దందా, 7+1 శాతం అక్రమ వసూళ్లు ఉన్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నారని.. పల్లెలు పడకేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో షాడో ముఖ్యమంత్రులు.. షాడో మంత్రుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతుందని ఆయన విమర్శించారు.


గాడి తప్పిన శాంతిభద్రతలు

ఎమ్మెల్యే ముఠాగోపాల్

హైదరాబాద్‌లో శాంతిభద్రతలు గాడి తప్పాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మండిపడ్డారు. ఓల్డ్‌సిటీలో రోజుకో హత్య జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో పాలన లేకపోవడం వల్ల చెత్తాచెదారం, మట్టికుప్పలు పేరుకుపోయిందని ధ్వజమెత్తారు. దోమల వ్యాప్తి పెరిగిపోతుండడంతో, డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని నియంత్రించే అధికారులు లేకపోవడం బాధాకరమని వాపోయారు. గ్రూప్-1, గ్రూప్-2 నిరుద్యోగులు బయటకు రావడానికి భయపడుతున్నారని తెలిపారు. కరెంటు కోతలు పెరిగాయని అన్నారు. నగరంలో ఎక్కడ చూసినా వీధికుక్కల స్వైరవిహారం వల్ల మరణాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలన పూర్తిగా పడకేసిందని, అసలు ప్రభుత్వం ఉందా? లేదా? అని ఎమ్మెల్యే ఆగ్రహించారు.


విద్యార్థిని చితకబాదిన కళాశాల సిబ్బంది

- ఫోన్‌లో మాట్లాడుతున్నాడని వాతలొచ్చేలా దెబ్బలు
- లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో ఘటన



విద్యార్థి శరీరంపై కనిపిస్తున్న వాతలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 11: ఫోన్‌లో మాట్లాడుతున్నాడని ఓ విద్యార్థిని కళాశాల సిబ్బంది చితకబాదింది. ఈ ఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చోటుచేసుకుంది. పుట్టపాగ ఉమేశ్ లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం ఫోన్‌లో మాట్లాడుతున్నాడని కళాశాల సిబ్బంది వాతలుపడేలా చేతులపై కొట్టారు. విషయం బయటకు పొక్కకుండా ప్రయత్నించారు. విద్యార్థులకు ఎవరికైనా చెప్తే.. అంతు చూస్తామంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లి ఉమేశ్‌ను దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. తండ్రి చనిపోయినా ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చదివిస్తున్నానని బాధితుడి తల్లి వాపోయింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలస్వామి మాట్లాడుతూ.. 'విద్యార్థి ఫోన్‌లో మాట్లాడాడని రెండు దెబ్బలు వేశారు.. ఈ సమస్యను పెద్దదిగా చేయకండి.. నేను మాట్లాడతా.. రేపు కళాశాలకు వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా' అని తెలిపారు. జిల్లా సమన్వయకర్త శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. 'ఈ కాలంలో కూడా దవాఖాన పాలయ్యేలా కొడతారా? అలా ఏం జరిగి ఉండదు.. విషయంపై వాకబు చేస్తా. ఒకవేళ కొట్టినట్టు తెలిస్తే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటా' అని పేర్కొన్నారు.



ఐదు రోజులుగా అంధకారంలోనే!

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్‌లోని ఎస్సీ కాలనీలు ఐదు రోజులుగా చీకట్లోనే మగ్గాయి. రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, ఎర్త్ సమస్యతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఆదివారం కాలనీల్లో రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్త్ సమస్యను పరిష్కరించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడుతుండటంతో తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని కాలనీవాసులు వాపోయారు. ఐదు రోజులపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డామని, సమీపంలో పంటపొలాలు ఉండటంతో భయాందోళనకు గురయ్యామని తెలిపారు.

– అయిజ



వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రైతుల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఫార్మాకు భూములియ్యం

- 'కొడంగల్-నారాయణపేట'పై రైతుల ఆందోళన ఉధృతం
- వికారాబాద్ జిల్లా హకీంపేటలో రోడ్డెక్కిన భూబాధితులు
- ఐటీ, టెక్స్‌టైల్, ఈవీ పరిశ్రమలు తేవాలంటున్న రైతన్నలు
- ప్రజల ప్రయోజనాలను దెబ్బ తీస్తే సహించం : మాజీ ఎమ్మెల్యే పట్నం

కొడంగల్, ఆగస్టు 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో 'కొడంగల్-నారాయణపేట' ఎత్తిపోతల పథకం ముసుగులో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టంచేశారు. తమ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన పేరుతో సాగు భూములను గుంజుకుని కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై బాధిత రైతులు ఇప్పటికే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి సమస్యను వివరించిన విషయం తెలిసిందే. కొడంగల్ ప్రజలకు హాని కలిగించే ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని సర్కారు వెనక్కి తీసుకోవాలని రైతులు రోజురోజుకూ ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో ఫార్మా కంపెనీ భూ బాధిత రైతులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కలలుకంటున్న కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం నియోజకవర్గ రైతుల కోసమా? లేక ఫార్మా కంపెనీల కోసమా? అంటూ ప్రశ్నించారు. కొడంగల్ ప్రజల ప్రయోజనాల కోసం చేపట్టే ఎటువంటి అభివృద్ధి పనులకైనా పూర్తి మద్దతు ఇస్తామని, కానీ ఫార్మా కంపెనీలు తీసుకొచ్చి పొల్యూషన్ అంటగట్టేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని నమ్మబలుకుతూ కొడంగల్ అమాయక ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేసే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు సెంటు భూమిని కూడా ఇచ్చేది లేదని, రైతుల పక్షాన ఉంటూ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. అభివృద్ధి పేరుతో సాగు భూములను లాక్కుంటులే ఎత్తిపోతల పథకంతో వచ్చే సాగునీరు ఏం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నట్టు తెలిపారు. భూములే లేనప్పుడు సాగునీరెందుకుని నిలదీశారు. కొడంగల్ ప్రజలు రేవంత్‌కు సీఎం పదవిని కట్టబెడితే.. రేవంత్ కొడంగల్ ప్రజలకు బహుమానంగా పొల్యూషన్‌ను అంటగడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కోవాలని, ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, రైతులు, ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. సీఎంకు కొడంగల్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంటే ఐటీ, టెక్స్‌టైల్, అమెజాన్, ఎలక్ట్రిల్ వాహనాల తయారీ వంటి ఎన్నో కంపెనీలు ఉన్నాయని, వాటిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట గ్రంథాలయ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భీములు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, భూ బాధిత రైతులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- బంగ్లాదేశ్ అల్లర్ల వెనుక అమెరికా: హసీనా
- 109 రకాల కొత్త వంగడాల ఆవిష్కరణ
- చైనాలో కొత్త వృత్తి.. నిద్రపుచ్చే స్లీప్ మేకర్స్
- ఫోన్ బానిసత్వాన్ని దూరం చేసే చాస్టిటీబెల్ట్
- ఎక్కువగా పళ్లూడిపోతే గుండెజబ్బులు

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 12.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+4 Pages: 10+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 68 ‖ వెల (Price) రూ.6.50 | సప్తమి

సోమవారం, సూర్యోదయం: 5-58, సూర్యాస్తమయం: 6-43. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: సప్తమి ఉదయం 7-55 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: స్వాతి ఉదయం 8-33 వరకు, తదుపరి విశాఖ. వర్జ్యం: పగలు 2-40 నుంచి సాయంత్రం 4-25 వరకు. రాహుకాలం: ఉదయం 7-34 నుంచి ఉదయం 9-10 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-46 నుంచి పగలు 1-37 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-18 నుంచి సాయంత్రం 4-09 వరకు. అమృతకాలం: రాత్రి 1-08 నుంచి రాత్రి 2-52 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

గురుకులంలో గురువులేరి?

ఒక్క కొడంగల్‌లోనే 22 పోస్టులు ఖాళీ



- ఇదీ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ పరిస్థితి
- ఉప్పల్ ఇంటర్ గురుకులంలో విద్యార్థులే లేరు
- అయినా అన్ని సబ్జెక్టులకు లెక్చరర్ల నియామకం
- 'సంక్షేమం'లో ఇష్టారాజ్యంగా సర్కారు బదిలీలు
- ట్రాన్స్‌ఫర్ చేసినట్టే చేసి ఆ వెంటనే రిటెన్షన్లు
- అస్తవ్యస్త నిర్ణయాలతో చదువులపై తీవ్ర ప్రభావం

ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలు, వాటి పరిధిలోని గురుకులాల్లో ఇటీవల చేపట్టిన బదిలీలు, ప్రమోషన్లపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలు, ప్రమోషన్ల కోసం రూపొందించిన సీనియార్టీ జాబితాలను తప్పులతడకగా రూపొందించారని సంబంధిత శాఖల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులు నిప్పులు చెరుగుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు కల్పించారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని ఎస్సీ గురుకులంలోని బదిలీలే నిలువెత్తు నిదర్శనంగా ఉదహరిస్తున్నారు.

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ఇక్కడి గురుకులంలో 5 నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన కొనసాగుతుండగా, 500-600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆ మేరకు గురుకుల సిబ్బందిని నియమించలేదు. గురుకులంలోని జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో గణితం తప్ప తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల పోస్టులన్నీ ఖాళీగానే పెట్టారు. పీజీటీకి సంబంధించి తెలుగు, గణితం, సోషల్, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీ, ఆర్ట్ టీచర్, సీనియర్ అసిస్టెంట్ మొత్తంగా 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీజీటీకి సంబంధించి బయోసైన్స్, తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సోషల్, ఫిజికల్ సైన్స్ › 2వ పేజీలో

గురుకుల విద్యార్థికి విద్యుత్తు షాక్

- ములుగు జిల్లా కర్లపల్లి సంక్షేమ పాఠశాలలో ఘటన
- కిటికి చువ్వకు కరెంటు వైరు.. తాకి కిందపడిన విద్యార్థి
- ప్రాథమిక చికిత్స అనంతరం దవాఖానకు తరలింపు › 3

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు

- ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏడుగురిపై దాడి › 6
- దవాఖానలో చికిత్స.. ముగ్గురి పరిస్థితి విషమం



బ్రాండ్ తెలంగాణను బలిపెట్టొద్దు

- ప్రభుత్వ పాలసీలు పెట్టుబడులను ఆకర్షించాలి
- కాంగ్రెస్ సర్కారు స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు
- ఎంతో కష్టపడితే వచ్చిన 'అమరరాజా' రాష్ట్రాన్ని వీడుతామని ప్రకటించడం బాధాకరం
- కేన్స్, కార్నింగ్ వేరే రాష్ట్రాలకు తరలిపోయినయ్
- ఇదీ విపత్తు లాంటిదే.. కేటీఆర్ తీవ్ర ఆవేదన

> *కేన్స్ టెక్నాలజీ గుజరాత్‌కు, కార్నింగ్ సంస్థ చెన్నైకి తరలిపోయింది. ఇప్పుడు అమరరాజా కూడా వెళ్లిపోతానంటున్నది. అదే జరిగితే తెలంగాణ బ్రాండ్‌కు తీరని నష్టం జరుగుతుంది.*
>
> *-బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్*

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): బ్రాండ్ తెలంగాణను కాపాడాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ ప్రకటించినట్టుగా వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే అంతకన్నా దురదృష్టకరం మరోటి ఉండదని, ఇది విపత్తులాంటిదేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి అర్థంకాక చాలాసంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే కేన్స్ టెక్నాలజీ తెలంగాణ నుంచి గుజరాత్‌కు, కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందని ఉదహరించారు. తాజాగా › 3వ పేజీలో



సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది విష ప్రచారం!

- కాళేశ్వరం కూలితే రంగనాయకసాగర్‌కు నీళ్లెలా వచ్చాయో ప్రభుత్వం చెప్పాలి?
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే గోబెల్స్ ప్రచారం
- ఎనిమిదేసి ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ కలిసి తీవ్ర అన్యాయం
- పింఛన్లు అందక అవ్వాతాతల అరిగోస
- రంగనాయక సాగర్ సందర్శనలో హరీశ్

సిద్దిపేట, ఆగస్టు 11: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు విషప్రచారం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మేడిగడ్డ రెండు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందంటూ విష ప్రచారం చేశారని, మరి ఇప్పుడు కూలిన కాళేశ్వరం నుంచి రంగనాయకసాగర్‌కు నీళ్లు ఎట్లా వచ్చాయని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఆదివారం రంగనాయకసాగర్‌లోకి పంపింగ్ చేస్తున్న › 3వ పేజీలో

సాగర్‌లో ఏపీ అధికారుల దౌర్జన్యం



- క్రస్ట్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జి తాళం ధ్వంసం
- తమ పరిధిలోనిదేనంటూ వితండవాదన › 2

నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

- ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటన
- కోల్‌కతాలో డాక్టర్ హత్యపై జాతీయ స్థాయి నిరసన › 5
- దవాఖానల్లో వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్



మణిపూర్‌లో మళ్లీ హింస

- రుసుము వసూళ్లపై ఆధిపత్యం కోసం కాల్పులు
- ఒకే వర్గానికి చెందిన నలుగురు మృతి › 5

ఇంటర్ సెకండియర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- ఈ ఏడాది నుంచి అమలు
- 80 మార్కులకు థియరీ, 20 మార్కులకు ప్రాక్టికల్స్ › 8

బిడ్డలను కాపాడబోయి..

- రైలు ఢీకొని తండ్రి, ఇద్దరు కూతుళ్ల దుర్మరణం
- గౌడవెల్లిస్టేషన్‌లో ప్రమాదం
- భార్య కళ్లెదుటే విషాదం › 6



వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు

ఫార్మా కంపెనీలకు భూములియ్యం

కొడంగల్ రైతుల ఆందోళన ఉధృతం

- ఐటీ, టెక్స్‌టైల్, ఈవీ పరిశ్రమలు తేవాలంటున్న రైతన్నలు › 3
- హకీంపేటలో భూబాధితుల ధర్నా.. తరలివచ్చిన అన్నదాతలు
- భూముల కోసం రేవంత్ కుటుంబం బెదిరిస్తున్నదంటూ ఆరోపణ
- కేటీఆర్‌ను కలిసి తమ పోరాటానికి మద్దతివ్వాలని రైతుల వినతి
- ప్రజా ప్రయోజనాలను కాంగ్రెస్ సర్కారు దెబ్బతీస్తే సహించం
- రైతుల పక్షాన పోరాడుతాం.. మాజీ ఎమ్మెల్యే పట్నం హెచ్చరిక

భరోసా ఇచ్చేదెప్పుడు?

అసెంబ్లీలో రైతుభరోసా ఊసెత్తని సర్కారు



- సభలో చర్చ లేదు.. అభిప్రాయ సేకరణ లేదు
- నాలుగు సమావేశాల తర్వాత రాం రాం
- క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఇచ్చేదెప్పుడు?
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- ఇప్పటికే సగం పూర్తయిన వానకాలం సీజన్
- అయినా రైతుభరోసాపై ఇప్పటికీ లేని స్పష్టత
- ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నదా?

హైదరాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): 'రైతు భరోసాపై మంత్రుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకొని ఆ తర్వాత రైతులకు పెట్టుబడి సాయం అందిస్తాం..' ఇది పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు చెప్పిన మాట. ఇప్పటివరకు మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చిందీ లేదు.. అసెంబ్లీలో చర్చించిందీ లేదు. రైతుల అభిప్రాయాల సేకరణ పేరిట హడావుడిగా నాలుగు సమావేశాలు నిర్వహించిన కమిటీ ఆ తర్వాత ఆ ప్రక్రియకు రాం రాం చెప్పింది. రైతుభరోసా ఎప్పుడిస్తారు? ఎవరికి ఇస్తారు? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే వానకాలం సాగు సగం పూర్తయింది. రైతులేమో పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు సేకరించి రైతుభరోసా విధి విధానాలను రూపొందించేందుకు జూలై 2న ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఉన్నారు. కమిటీ రైతుల అభిప్రాయాలు సేకరించి 15 రోజుల్లో › 2వ పేజీలో



ట్రయల్ రన్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్ నుంచి ఉరకలేస్తూ ఉప్పొంగిన గోదావరి జలాలు

సీతారామ ట్రయల్ సక్సెస్

రెండో పంప్‌హౌస్ నుంచి ఉప్పొంగిన జలాలు


ఉమ్మడి ఖమ్మం జిల్లా కోసం కేసీఆర్ జలసంకల్పం.. ప్రారంభానికి సిద్ధమైన ప్రాజెక్టు

రెండేండ్లలో పూర్తిస్థాయిలో సాగునీళ్లిస్తాం.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ములకలపల్లి/ వైరా టౌన్, ఆగస్టు 11: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించాలన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం నెరవేరబోతున్నది. ఈ జిల్లాకు సాగునీళ్లు అందించే సీతారామ ప్రాజెక్టు ట్రయల్‌రన్ విజయవంతమైంది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం సమీపంలోని వీకే రామవరం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్ ట్రయల్ రన్‌ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. అనంతరం కమలాపురం వద్ద నిర్మిస్తున్న మూడో పంపుహౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి › 2వ పేజీలో

కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

- 19వ గేటు చైన్ లింక్ తెగిపోవడమే కారణం
- గేట్లు ఎత్తి భారీగా దిగువకు నీటి విడుదల
- కర్ణాటకలోని కొప్పల్ జిల్లాకు హెచ్చరికలు
- ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా అప్రమత్తం
- 70 ఏండ్ల డ్యామ్ చరిత్రలో ఇదే ప్రథమం



కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో ఒత్తిడి తగ్గించేందుకు మరో ఏడు గేట్లు తెరిచి నీటిని కిందికి వదులుతున్నారు. 65 టీఎంసీల నీటిని వదిలితే తప్ప మరమ్మతు సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. › 2



ఒక్కో వైన్స్‌కు అదనపు టార్గెట్ 50 లక్షలు!


- టార్గెట్లు రీచ్ అయ్యాయా? అంటూ ఫోన్లు
- షాపు యజమానులపై అధికారుల ఒత్తిడి
- తలలు పట్టుకుంటున్న మద్యం వ్యాపారులు
- నెలకు రూ.3 వేల కోట్లకుపైనే అమ్మకాలు
- అయినా టార్గెట్లు విధిస్తూ వేధింపులు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో మద్యం దుకాణదారులు కొత్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలాఖరు వస్తున్నదంటే చాలు 'టార్గెట్లు రీచ్ అయ్యారా?' అంటూ వస్తున్న ఫోన్లతో తలలు పట్టుకుంటున్నారు. ఎక్సైజ్‌శాఖ 'అదనపు ఒత్తిడి'ని భరించడం తమ వల్ల కాదంటూ గగ్గోలు పెడుతున్నారు. ఒక్కో షాపు అదనంగా రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల మద్యం అదనంగా కొనుగోలు చేసి అమ్మాలంటూ కొందరు అధికారులు ఫోన్లు చేసి మరీ ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ పెద్దల › 2వ పేజీలో

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ వేయాలి

- స్కామ్‌ను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి
- సెబీ చైర్‌పర్సన్ మీద హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ప్రతిపక్షాల డిమాండ్
- ఆరోపణలను ఖండించిన సెబీచీఫ్ మాధవి, అదానీ గ్రూప్





న్యూఢిల్లీ/ముంబై, ఆగస్టు 11: అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ శనివారం విడుదల చేసిన డాక్యుమెంట్‌పై మరోసారి దేశంలో రాజకీయ దుమారం రేగింది. అదానీ గ్రూపు కంపెనీల్లో భారత స్టాక్ మార్కెట్ల నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌కు, ఆమె భర్తకు రహస్య వాటాలు ఉన్నాయని చేసిన ఆరోపణలు సంచలనంగా › 5వ పేజీలో

నీ ఉన్నతి నీ చేతిలోనే

గీతావాక్యం

ఉద్ధరే దాత్మనాఽత్మానం నాత్మానమవసాదయేత్|
ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః||
(భగవద్గీత 6-5)

ప్రపంచంలో ప్రతివ్యక్తీ తనను తానే ఉద్ధరించుకోవాలే కానీ పతనావస్థను పొందకూడదు. ప్రపంచంలో తనకు తానే బంధువు.. తానే శత్రువు అంటున్నాడు కృష్ణపరమాత్మ. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' సాంసారిక బంధాలకు లేదా విముక్తికి కారణమైన మనసు వలలో చిక్కితే బంధనాలు.. దానిని జయిస్తే.. విముక్తి. మనసును జయించినవాడే ఆత్మవంతుడు, ప్రశాంతుడు, విజయసాధకుడు. గురువులు, శాస్త్రాలు, దేవుడు.. ఇవన్నీ మార్గాన్ని చూపుతాయే కాని నడవవలసింది మాత్రం మనమే! పంచభక్షపరమాన్నాలను బల్లపై ఉంచినా.. మనకాళ్లతోనే అక్కడికి నడవాలి. మన కండ్లతోనే చూడాలి. మన చేతులతోనే తినాలి. వందమంది అనుభవజ్ఞులైన వైద్యులు తనచుట్టూ ఉన్నా క్షయరోగి తన దగ్గు తానే దగ్గాలి.

ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలనే తపన అణువణువునా రగిలిపోయే వ్యక్తి ఉన్నత శిఖరాలకు చేరగలుగుతాడు. సోమరులై, ఇంద్రియలోలురై, ప్రవాహాన్ని అనుసరించి నడిచేవారిని ఏ దేవుడూ ఉద్ధరించడు. అనుక్షణం మన మనసు ధర్మాధర్మ విచికిత్స చేస్తూనే ఉంటుంది.. యుక్తమైన దానిని ఆదరిస్తే.. జీవితలక్ష్యం నెరవేరుతుంది. ఎవరైనా సహాయం చేస్తారు లేదా భగవంతుడే ఉద్ధరిస్తాడనే భావన పనికిరాదు. ఆరుపాళ్లు నువ్వు ప్రయత్నిస్తే.. ఒకపాలు భగవంతుడు సాయపడతాడు. తనను తాను ఉన్నతీకరించుకునే వ్యక్తికే భగవంతుడు కూడా సహాయకారిగా ఉంటాడనే సామెత ఉన్నది.
త్రికరణశుద్ధిగా భగవంతుని నమ్మిన భక్తుడొకరు భాగవతం చెబుతున్నాడు. ఊరి పక్కన ఉన్న చెరువుకట్ట తెగి నీరు ఊరిలోకి వస్తున్నది. ఒకరు, ఇద్దరూ, ముగ్గురూ ఇలా పదిమంది వచ్చి నీటిప్రవాహం ఉధృతంగా ఉన్నదని, అందరూ వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారు. ఒక్కొక్కరుగా శ్రోతలంతా అక్కడినుంచి వెళ్లారు. భక్తుడు మాత్రం భగవంతుడే తనను కాపాడతాడని అక్కడే ఉండిపోయాడు. ప్రవాహవేగం అధికమై చివరకతను ప్రవాహంలో పడి ప్రాణాలు విడిచాడు. భగవంతుని వద్దకు చేరుకున్న భక్తుడు 'నన్నెందుకు రక్షించలేదు' అని దేవుణ్ని నిలదీశాడు. అప్పుడు భగవంతుడు 'పలుమార్లు వివిధ వ్యక్తుల రూపంలో వచ్చి నేను హెచ్చరించాను. నీవే మూర్ఖంగా వచ్చిన అవకాశాలన్నిటినీ చేజార్చుకున్నావు' అని చెప్పాడు. ఎవరో వచ్చి ఉద్ధరిస్తారనే భావన సరైనది కాదు. ప్రయత్నం కర్మఫలాన్ని కూడా మార్చుతుందని చెబుతుంది యోగవాసిష్ఠం. అవకాశాలు వచ్చి చుట్టూ పలకరిస్తున్నా.. వాటిని గుర్తించలేని గుడ్డివారిని భగవంతుడు కూడా రక్షించలేడు.
భౌతిక ఆకర్షణల వలయంలో చిక్కి, జీవిత గమ్యానికి దూరమైన వాడిలో జాత్యంతరీకరణ జరగదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతూ.. మనసును తన అధీనంలో పెట్టుకొని ముందుకు సాగేవానికి మనసే బంధువుగా సాయపడుతుంది. ఆటంకాలు కలుగుతాయనే భ్రాంతిలో, ఆ ఆలోచనలనే మనసుకు సూచనలుగా ఇస్తే.. ఆ మనసే శత్రువై అన్ని కార్యాలయందు అపజయాన్ని ఇస్తుంది.
ఉనికిలోనే శూన్యత్వాన్ని, శూన్యత్వంలోనే ఉనికిని




గుర్తించగలిగిన వారే అవకాశాలను అందిపుచ్చుకుంటారు.. విజయాన్ని సాధిస్తారు. నిరంతర సాధన, ఆధునీకరణే విజయానికి దగ్గర దారి. ఇతరుల మెప్పుకోలు మనలో ఆశలను, అహంకారాన్ని పెంచుతుంది.. అదే మనస్థాయిని నిర్ణయిస్తే వారికి మనం బందీలమైనట్లే. ఇతరుల ఆలోచనల ప్రకారం లేదా అభిప్రాయాల ప్రకారం నడవడం కాకుండా మన అంతరంగం ఏం చెపుతున్నదో ఆ విధంగా నడిచేవాడే మార్గదర్శకుడు అవుతాడు. జీవిత ప్రయాణంలో అంతరంగమే కేంద్రం కావాలి.. బాహ్యమైన అంచులలో ఇతరుల అభిప్రాయాలు నిలవాలి. అప్పుడే మనసు నీ అధీనంలో ఉంటుంది.. భౌతిక జగత్తులో ప్రగతి ఆధ్యాత్మిక జగత్తులో సుగతి కలుగుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

ప్రభువులో నివాసం

క్రీస్తు సందేశం



మానవ జన్మ సార్థకం కావాలన్నా, జన్మ ఫలం పరిపూర్ణం కావాలన్నా.. 'ప్రభువు మనిషిలో, మానవుడు ప్రభువులో నివసించాల'ని ప్రభువే సూచించాడు. ముందుగా మానవుడు ఆయన్ను ఆహ్వానిస్తే.. ఆ తర్వాత ఆయన మానవుడికి ఆతిథ్యం అవుతాడు. ఇక్కడ పరస్పర ప్రేమానురాగాలు చాలా సూక్ష్మంగా అంతస్సూత్రంగా కనిపిస్తున్నాయి. క్రైస్తవం అంటే క్రీస్తుకు సంబంధించింది. 'ఏవిధమైన సంబంధం అది?'. ఆయనతోడి నిరంతర బంధం. ఆయన లేకుండా మనం ఏ పనీ చేయలేం. మన ప్రతిపనికీ ఆయనే ముందుంటే.. విజయం గాక, ఫలితం మరొకటి ఎదురవుతుందా? అందుకే ప్రభువు ఇలా అంటాడు. 'ఎవడు నాయందు నిలిచి ఉండునో, నేను ఎవని యందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును' (యోహాను 15:5) ఇలా పలకడంలో అర్థం ఇదే. కాబట్టి మనిషి ఆయనతో లగ్నం కావడం తథ్యం. అది అనివార్యం.
ఆయన ఒక ద్రాక్షపాదు అయితే, మనమంతా దానికి అల్లిబిల్లిగా అల్లుకున్న ఆ ద్రాక్షావల్లులం, పువ్వులం. ద్రాక్ష కాండకు సంబంధం లేనివి ఏవైనా సరే, ఎండిపోతాయి. ఆ వల్లుల్ని, ఆ రెమ్మల్ని ఊరకే అలా ఎవరూ ఉంచరు. ఉన్నా చెట్టుకే ముప్పు. పచ్చదనం అందమూ దెబ్బతింటుంది. అందుకే విరిచేస్తారు. అందుకే ద్రాక్ష పాదు లాంటి ఆ ప్రభు బంధంతో నివసించాలనేది క్రైస్తవుల నమ్మిక. ఒకే పాదు వల్లికలన్నిటికీ ఒకే పచ్చదనం సమైక్యత ప్రకటిస్తుంది. ఇలా ఉండటం అనేది ప్రభువు పట్ల వారి అచంచల విశ్వాసానికి, కార్యనిమగ్నతకు ఒక తార్కాణం ! ఆయన వల్ల పరిపూర్ణ ప్రేమ, మేధా సంపత్తి, శక్తి సామర్థ్యాలు, దయాదాక్షిణ్యాలు లభిస్తాయనేది వారి విశ్వాసం!

... ప్రొ|| బెర్నార్డ్ రాజు,
98667 55024



శుకముని పరీక్షిత్తుతో.. రాజా! ఆ హేమంత రుతువు ప్రథమ మాసం మార్గశిరంలో మొదటి రోజున నందుని మంద(గొల్లపల్లె)లోని ఇందువదనలు– గోపకన్యలు వేకువలో ముందుగా నిద్రలేచారు. ఆనందంగా కాళిందీ నదికి వెళ్లి స్నానాలు చేశారు. గట్టున ఇసుకతో అందంగా గౌరీదేవి ప్రతిమను రూపొందించి, పుష్పాలతో అలంకరించారు. చందనం అలది, ధూప దీపాలతో అర్చించి పలు విధాల నైవేద్యాలు అర్పించారు. ఇలా నెల పొడవునా హవిష్యాన్నం భుజిస్తూ నెలతలు- గోపకాంతలు శ్రీపతిని- కృష్ణుని పతిగా కోరి కాత్యాయనీ వ్రతం ఆచరించారు.

చేలాపహరణ లీలా పరమార్థం



మన పోతన మధురిమ 180 వ భాగం

కం|| ఓ కాత్యాయని! భగవతి!
నీకున్ మ్రొక్కెదము నేము నేడనుకంపన్
మా కిందరకును వైళమ
శ్రీకృష్ణుడు మగడు గాగ జేయుము తల్లీ!

భగవతీ! ఓ కాత్యాయనీదేవీ! నీకు అనేక వందనాలు. దయతో మా అందరికీ తొందరగా నందసుతుని పతిగా ప్రసాదించవమ్మా!

కం|| ఓ తల్లి! మాకు కృష్ణుడు
చేతో విభుడైన నాడు చెలువల మెల్లన్
నేతి వసంతము లాడుచు
జాతర సేసెదము భక్తి చాతురి తోడన్

'ఓ అమ్మా! ఉమాదేవీ! మాకు మా(లక్ష్మీ)పతి మగడు అయిన నాడు మేమందరమూ నేతి వసంతాలాడుతూ, పాడుతూ భక్తితో కడు వేడుకగా నీకు జాతర చేస్తాం' అంటూ కాత్యాయనీ దేవిని కటాక్షించమని కోరేవారు. 'భూయాన్నంద సుతః పతిః' (శ్రీకృష్ణుడు మగడు గాగ జేయుము) అన్న అష్టాక్షరీ మంత్రాన్ని ఆర్తితో నిష్ఠగా జపించేవారు. ''పాతి ఇతి పతిః'' పతి అనగా రక్షించువాడు అని అర్థం. సర్వరక్షకుడు కనుక శ్రీహరియే నిజమైన పతి. తనకే రక్షణ లేని జీవుడు మరో జీవుని ఎలా రక్షించగలడు? 'నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా' అనికదా మన ప్రార్థన! శ్రీపతి పతి అయితే ఏ సతికీ దుర్గతి– వైధవ్య దుఃఖం లేదు.
'కతి అయనాని మోక్షమార్గాః సంతి'– మోక్షానికి ఎన్ని మార్గాలున్నాయి?– అంటూ విచారణ చేసేవాడు కత్యయనుడు. బ్రహ్మవేత్త ఐన కత్యయన మహర్షికి ఒక కల్పంలో పుత్రికగా ఆవిర్భవించిన కారణాన అమ్మవారికి 'కాత్యాయని' (బ్రహ్మ విద్య) అని పేరు. నందనందనుడు గోవిందుని పొందుకోరి కుందరదనలు– గోపికలు గానం చేసిన– 'ఓ తల్లి మాకు కృష్ణుడు..' అన్న కంద పద్యం పోతన్న గారి సొంతం.

రాజా! ఆ గజగమనలు యమునా తీరం చేరి ఒక విజన (ఏకాంత) స్థలంలో వలువలు– చీరలు విడిచారు. కళంక రహితలైన ఆ పంకజనేత్రలు జంకు లేక జలకాలాడటానికి జలంలో దిగారు. వారిజాక్షుని– కృష్ణునిపై పాటలు పాడుతూ అవ్వారిగా– తమ ఇచ్ఛ కొలదీ వారి (జల) విహారాలు– జలక్రీడలు ఆడారు. రాజా! వారి– గోపికల విహరణలు.. గోవిందుని స్మరిస్తూ వారు పొందిన ఆనంద పారవశ్యాలు లోకంలోని వారికి– ఇతరులకు ఎందైనా ఉన్నాయా? ఆ తోయజ(పద్మ)నేత్రలు యమునా నదీ తోయాలలో (జలాలలో) దిగంబర స్నానాలు చేస్తున్నారని, దూరగుడైనా– దూరంలో ఉన్నా సర్వపారగుడు (సమర్థుడు) తోయజాక్షుడు యోగేశ్వరేశ్వరుడు శ్రీకృష్ణుడు తెలుసుకొని, వారిని అనుగ్రహించాలని వ్రతం చివరి రోజున త్వరిత గతిని తోడి గోపబాలురతో అచ్చటికి విచ్చేశాడు. కదలకుండా ఇక్కడే ఉండండని తోడివారికి కనుసైగ చేసి, సరిగా సమయం చూసి ఆ గొల్ల చెలువల– గోపికల వలువలు దొంగిలించి ఒక కదంబ వృక్షం– కడిమిచెట్టు ఎక్కి కూర్చున్నాడు. పరమార్థంలో... గోపికల 'అనాది అజ్ఞాన ఆవరణ'మనే అంబరా(చీర)లను అపహరించాడు. కృష్ణుడు అంటేనే కర్షించే– లాగివేసే వాడని అర్థం. ఏమిటి ఆ లాగేది అంటే.. జీవులకున్న 'దేహమే నేను' అన్న అభిమానమనే అజ్ఞానాన్ని– దేహాత్మబుద్ధిని. 'గోపాయితుం ఇచ్ఛతి ఇతి గోపీ'– తన్ను తాను మరుగుపరచుకొనే– దాచుకొనే ప్రయత్నమే గోపీత్వం– జీవత్వం. ఇలాంటి బుద్ధి– స్వభావం ఉన్నంతవరకు జీవులందరూ స్త్రీలే– గోపికలే. సృష్టిలో ఒక్క జగన్నాథుడే పురుషుడు! అట్టి పురుషోత్తముని పరోక్షమని భావిస్తూ సిగ్గుతో బెదిరిపోయే స్వభావం కలవారే గోపికలు. వారు వారిజాక్షుని వస్త్రాలిమ్మని వేడుకొన్నారు. బతిమలాడారు..

కం|| మామా వలువలు ముట్టకు
మామా! కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మానమేల కొనియెదు? మా
మానస హరణమేల? మానుము కృష్ణా!

మామా! మా కోకలు ముట్టుకోమాక, పట్టుకుపోమాక, మమ్ములను మన్నించు. మా మానమెందుకు హరిస్తావు? మా మనస్సులను ఎందుకు దోచుకుంటావు? నీకు వావి వరుసలు ఉన్నట్లు లేదు. అయినవారు, కానివారు అన్న వివేకం ఉండాలి కదా? కృష్ణా! నీ గుట్టు కనిపెట్టామయ్యా. ఈ తుంటరి పనులన్నీ మానుకో. రాజీవలోచనా! మేము అబలలం. మా చీరలు మాకు ఇవ్వకుంటే ఈ విషయం నందరాజుకు చెపుతాము.

శా|| ఇంతుల్ తోయము లాడుచుండ మగవారేతెంతురే? వచ్చిరా యింతల్ సేయుదురే? కృపా రహితులై యే లోకమందైన నీ వింతల్ నీ తల బుట్టెగాక మఱి యేవీ కృష్ణ! యో చెల్ల! నీ చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబు లిప్పింపవే!'

'కృష్ణా! ముగుదలు స్నానాలు చేస్తుంటే మగవారు ఆ పరిసరాలకు రావచ్చునా? వచ్చారే పో, జాలిలేక రెచ్చిపోయి ఇలా నొచ్చుకొనే అల్లరి పనులు చెయ్యొచ్చా? ఔరా! ఈ వింత చేష్టలు నీకే చెల్లాయి. కృష్ణా! నీకు దాస్యం చేస్తూ నీ చెంతనే పడి ఉంటాము. మా పటములు– చీరలు మాకిప్పించు'. పై శార్దూల వృత్తం పోతన అమాత్యుల చిత్త సంజాతం– స్వీయం. 'ఇంతల్ సేయుదురే' అన్న మాటలో ఎంత కవిత్వముందో! అది భావుక భక్తులకు ఆలోచనామృతం!
పరమాత్మ ఇలా పలికాడు.. 'ఏ పడుచువాణ్ని పతిగా కోరి మీరు ఈ కాత్యాయనీ వ్రతం చేశారో చెప్పండి. అబద్ధమాడితే మీ మీద ఒట్టు. ఈ వలపు మీతోనే పుట్టింది కాదు. ఇల(భూమి)పై అంతటా ఉన్నదే. 'నేను' పరాయివాడనా? 'ఎఱుగనే మీలోన నెప్పుడు నున్నాడ, నేను జూడని మర్మమెద్ది గలదు?'– నేను ఎప్పుడూ అంతర్యామిగా మీలోనే ఉన్నాను. ('ప్రజ్ఞానం బ్రహ్మ'– తెలివే స్వరూపంగా ఉన్నవానికి తెలియనిదంటూ ఏదైనా ఉంటుందా? సర్వజ్ఞునికి మరుగు, మర్మములనేవి ఉంటాయా?) నాకు తెలియని, నేను చూడని రహస్యమేముంది కనుక? దాసుని దోషాలు దండంతో సరి! నాకు నమస్కరించి మీమీ వస్త్రాలు పుచ్చుకోండి.' పరమార్థంలో కృష్ణుడు లేని, కృష్ణుడు కాని గోపిక ఉందా? మట్టి లేని ఘటం (కుండ) ఉంటుందా? తంతువు (దారం) లేని పటం (వస్త్రం) ఉంటుందా? శ్రీశుకులు– రాజా! చాలా సేపు మథనపడి, చివరకు ఎలాగో మనసులు దిట్టపరచుకొని ఆ బాలలందరూ ఒక చేతితో మర్మాంగం మాటు పరచుకొని నీటి నుంచి వెలికి వచ్చి, ఒంటిచేతితో కొంటె కృష్ణునికి వందనం చేశారు. పరమాత్మ.. 'అయ్యో! ఒకటికి రెండు తప్పులు! వ్రతదీక్షలో దిగంబర స్నానం వరుణదేవునికి అపచారం. అంబికాదేవికీ అపరాధమే. ఏకహస్తాభివాదనం భగవదపచారం. ఆ చేతిని ఖండనం– నరకడమే దానికి దండనం! మీకు వ్రతఫలం దక్కాలంటే చక్కగా రెండు చేతులూ ఎత్తి నాకు నమస్కరించండి' అన్నాడు. వ్రతఫలం దక్కదనే సరికి వ్రేతలందరూ వెతచెంది వెంటనే నుదుట చేతులు జోడించి, ఒయ్యారంగా వంగి భగవంతుడు హరికి వందనం చేశారు. స్వామి సంతసించి వారి మృణ్మయ వస్త్రాలను చిన్మయం చేసి, మాంసపిండాలను– దేహాలను మంత్రమయం గావించి అనుగ్రహించాడు. రాసలీలా ప్రవేశానికి అర్హత కలిగించాడు.




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

ఈ లీలా సమయానికి గోపబాలునికి ఏడేళ్ల వయసు. పరమార్థం విచారించక కేవలం బాహ్యార్థం చూచి ఆధునిక విమర్శకులు అశ్లీల ప్రసంగమని ఆక్షేపిస్తారు. జీవుడు వాస్తవానికి సచ్చిదానంద స్వరూపుడే! కాని, ఆ స్వరూపం పంచకోశాలనే ఆవరణలతో (స్థూల శరీరం అన్నమయకోశం; ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలు సూక్ష్మ (లింగ) శరీరం; ఆనందమయ కోశం కారణ శరీరం) కప్పబడి ఉంది. ఈ ఆవరణలు తొలగితేనే ఆత్మస్వరూప దర్శనం. శరీర త్రయ తాదాత్మ్యం (దేహమే నేను అనే అభేద బుద్ధి) తొలగించుటే చీర హరణం. లోకంలో రసం– ఆనందం అనుభవానికి ఎప్పుడు వస్తుంది? తల్లికి, పాలు తాగే పిల్లకీ మధ్య వస్త్రమనే అడ్డు ఉన్నంతవరకు తల్లికి వాత్సల్యరసానుభవమూ ఉండదు. బిడ్డకి పాలు తాగే అవకాశమూ ఉండదు. అంతేకాదు, వస్త్రమనే ఆవరణ తొలగనిదే లోకంలో దాంపత్య– శృంగార రసాస్వాదనకు కూడా అవకాశం కలుగదుగా! అలాగే, ఆవరణ భంగం కానిదే రాసలీలా రసానుభూతి కూడా లేదు. వస్త్రాపహరణం ఆవరణ భంగలీల! రాసలీల జీవ బ్రహ్మ ఐక్యలీల! రాజా! ఇలా నారాయణుడు ఇచ్చిన చీరలను ఆ నారీమణులు ధరించి నందకిశోరుని ఆనందంగా అవలోకిస్తూ అక్కడే కదలకుండా నిలబడిపోయారు. చతురనటమూర్తి వారి చెంతకు చేరి.. 'అటమీద రాత్రుల యందు మీకు నన్ను బొందగల్గు నమ్మిపొండు'– రాగల రాత్రులందు మీకు నా కలయిక లభిస్తుంది. నా మాటలు నమ్మి మీరు ఇళ్లకు వెళ్లండి– అని చెప్పగా వ్రతఫలం దక్కిందని ముకుందుని చరణారవిందాలను మదిలో స్మరిస్తూ ఆనందంగా నంద గోకులం వెళ్లిపోయారు. ప్రపంచ జ్ఞప్తి– స్ఫురణలేని రాత్రివేళ, గాఢ సుషుప్తిలో 'నన్ను బొందగల్గు'– నాయందు ఐక్యం కాగలరు అని పరమార్థం!

(సశేషం)

కథాసుధ




దైవబలం మనోబలం

ఓ గ్రామంలో దేవుడి మీద నమ్మకంలేని ఒక యువకుడు ఉండేవాడు. అదే గ్రామంలోని గుట్టమీద సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. ప్రతి నెలా కృత్తికా నక్షత్రం నాడు స్వామివారికి గ్రామస్తులు ప్రత్యేక అభిషేకం చేసేవారు. ఆ రోజు కృత్తిక. ఊళ్లో వాళ్లంతా పూజ సామగ్రి తీసుకొని బయల్దేరుతున్నారు. గుడికి వెళ్తూ ఊరి పెద్ద ఆ యువకుడిని అభిషేకానికి రమ్మని పిలిచాడు. 'నేను రానంటే రాను' అని మొండికేశాడు ఆ యువకుడు. అతను మొండికేసే కొద్దీ ఊరిపెద్దలో కూడా పట్టుదల పెరిగింది. మరింత గట్టిగా గుడికి రమ్మని ఒత్తిడి చేశాడు. ఆ యువకుడు మొండికేసి.. చెట్టు ఎక్కి కూర్చున్నాడు. ఊరి జనమంతా అక్కడికి వచ్చి చేరారు. వెంటనే ఆ ఊరి పెద్ద.. ఆ యువకుడిని చెట్టు పైనుంచి కిందికి దూకమని కోరాడు. 'ఇంత ఎత్తు నుంచి దూకితే దెబ్బలు తగులుతాయి కాబట్టి.. నేను దూకను' అని మొరాయించాడు ఆ యువకుడు. అప్పటికప్పుడే ఊళ్లో యువకులు కొందరిని పురమాయించి, పెద్ద వల ఒకటి తెప్పించాడు ఊరిపెద్ద. పదిమంది వల పట్టుకోమని.. ఆ యువకుడిని దూకమన్నాడు. అతను మరో ఆలోచన లేకుండా చెట్టు పైనుంచి దూకాడు. ఏ గాయమూ కాలేదు. తర్వాత యువకుడిని పిలిచిన గ్రామపెద్ద.. 'మొదట దూకమంటే భయపడ్డావ్. వల పట్టుకోగానే దూకావు. ఆ వల లాంటిదే దైవం మీద నమ్మకం. మానవ మాత్రులమైన మనం జీవన సమరంలో ఎన్నో ఆటుపోట్లకు గురవుతుంటాం. ఎన్ని కష్టనష్టాలొచ్చినా ఆ దేవుడు మనల్ని కాపాడుతాడని నమ్మితే మనం ముందుకు పోగలం. సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. లేకుంటే సమస్యల దగ్గరే ఆగిపోతాం' అని వివరించాడు. 'దేవుడు ఉన్నాడన్న నమ్మకం మనకు బలాన్ని, సమస్యలను ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది' అనుకుంటూ అందరితో పాటూ గుడికి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

ఇస్లాం బోధ

కృతజ్ఞులై ఉందాం



ప్రవక్త మూసా (అలై) అల్లాహ్‌తో నేరుగా మాట్లాడారు కాబట్టి ఆయన్ను 'మూసా కలీముల్లాహ్' అని పేర్కొన్నది ఖురాన్. ఒకానొకసారి మూసా (అలై) అల్లాహ్‌తో మాట్లాడేందుకు తూర్ పర్వతం వైపునకు వెళ్లబోతుండగా ఓ వ్యక్తి అడ్డుపడి ''మూసా! నేను చాలా దార్రిద్యంలో ఉన్నాను. నా దరిద్రాన్ని తొలగించమని అల్లాహ్‌కు చెప్పండి'' అని విన్నవించాడు. సరేనని ఆయన ముందుకు వెళ్లారు. అంతలోనే ఇంకో వ్యక్తి తారసపడి ''ఓ మూసా నా దగ్గర ఎన్నో ఆస్తులు పోగయ్యాయి. సిరిసంపదలు లెక్కకు మించి వచ్చి చేరుతున్నాయి. ఇక చాలు, అల్లాహ్‌కు చెప్పి వాటిని ఆపివేయించు'' అని చెప్పాడు. ప్రవక్త (అలై) సరేనని ఇద్దరి స్థితిని అల్లాహ్‌కు వివరించారు. దానికి అల్లాహ్ ''మొదటి వ్యక్తితో నాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండమని చెప్పు. రెండో వ్యక్తితో నాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడం మానుకోమని చెప్పు'' అని చెప్పి పంపించారు. మూసా మొదటి వ్యక్తి దగ్గరికొచ్చి ''అల్లాహ్ నిన్ను విరివిగా కృతజ్ఞతలు తెలుపుతూ ఉండమని చెప్పాడు'' అన్నారు. దానికా వ్యక్తి అల్లాహ్ నాకేమిచ్చాడని నేను కృతజ్ఞతలు తెలపాలని అడిగాడు. అంతోనే పెద్ద గాలి దుమారానికి అతని ఒంటిమీద ఉన్న దుప్పటి కొట్టుకుపోయింది. నగ్నంగా మారిపోయాడు. ఇక రెండో వ్యక్తి దగ్గరికి వెళ్లి 'అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం మానుకో' అని చెప్పాడు. దానికా వ్యక్తి ''అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం మానుకోవడమన్నది నా వల్ల కాదు. నాకు ఇన్నిన్ని అనుగ్రహాలు ఇచ్చిన ఆయనకు కృతజ్ఞతలు తెలపకుండా ఎలా ఉండను' అన్నాడు. దీంతో ఆయన మరింత సంపన్నుడిగా మారాడు.
''మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నుతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది'' (17:7) అని ఖురాన్ వివరిస్తుంది. అల్లాహ్ ఇచ్చిన అనుగ్రహాల పట్ల నిత్యం ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండాలి. 'మనం చేస్తున్న ఈ చిన్న ఉద్యోగమే ఎంతోమంది నిరుద్యోగుల కల అని మర్చిపోకూడదు. మనకు చూడటానికి రెండు కళ్లూ ఇచ్చాడు. ఎంతోమంది కళ్లు లేనివారు అంధకారంలో జీవిస్తున్నారు. మన దగ్గర రెండు చేతులున్నాయి. రెండు చేతులూ లేనివారెందరో దీనంగా బతుకులు వెళ్లదీస్తున్నారు. రెండు కాళ్లు లేని వాళ్లు అవిటితనంతో జీవితాన్ని లాక్కెళుతున్నారు. ఆత్మసంతృప్తితో, కృతజ్ఞతాభావంతో జీవిస్తే అంతకుమించిన సంతోషాలు ఇంకెక్కడా దొరకవన్నది ఖురాన్ సందేశం.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

న్యాక్ గుర్తింపునకు కొత్త రూల్స్

ఐదు గ్రేడ్లుగా కాలేజీలకు గుర్తింపు • ఆన్‌లైన్‌లోనూ కాలేజీల తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): కాలేజీలను గుర్తించే విధానాన్ని సమూలంగా మార్చేందుకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) చర్యలు చేపట్టింది. అందుకోసం కొత్త నిబంధనలను రూపొందిస్తున్నది. తదనుగుణంగా ఇకపై ఏ, బీ, సీ, డీ గ్రేడ్లకు బదులుగా 5 స్థాయిల్లో మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్లు (ఎంబీజీఏ) జారీచేయనున్నది. దీనిపై న్యాక్ ఇటీవల బెంగళూరులో విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహించింది. దక్షిణాది రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల చైర్మన్లతో పాటు పలువురు విద్యారంగ నిపుణులను ఈ సమావేశాలకు ఆహ్వానించి, న్యాక్ నిబంధనలను మరింత సరళతరం చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరించింది. కొత్త నిబంధనలపై రాష్ట్రాల స్థాయిలో అవగాహన కల్పించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని అమలు చేసేందుకు సిద్ధమవ్వాలని సూచించింది. ఇప్పటివరకూ న్యాక్ గుర్తింపు కోసం కొన్ని కాలేజీలు మాత్రమే పోటీపడేవి. కానీ, ఇకపై అన్ని కాలేజీలు న్యాక్ గుర్తింపు పొందేలా ప్రోత్సహించేందుకు మార్గదర్శకాలను సవరించారు. న్యాక్ గుర్తింపును ఇచ్చేందుకు అనుసరిస్తున్న ప్రామాణికాలను 7 నుంచి 10కి పెంచారు. దీంతో ఇకపై కాలేజీలకు సంబంధించిన



ఐదేండ్ల డాటాను న్యాక్ బృందం పరిశీలిస్తుంది. మౌలిక సదుపాయల పెంపు, ఫ్యాకల్టీ, ఫలితాలు, ఉపాధి అవకాశాలు, సొంత బిల్డింగ్ ఉన్నదా? లేదా? అనే అంశాలను పరిశీలించి కాలజీలకు మార్కులు ఇస్తుంది. గతంలో ఉన్న నిబంధనలతో కొన్ని కాలేజీలు మాత్రమే న్యాక్ గుర్తింపును పొందగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలను సరళీకరించాలని న్యాక్ నిర్ణయించింది.

కొన్ని మార్పులు

- కాలేజీలను న్యాక్ గుర్తింపు ఉన్నవి (న్యాక్ కాలేజీలు), న్యాక్ గుర్తింపు లేనివి (నాన్-న్యాక్ కాలేజీలు)గా విభజిస్తారు. న్యాక్ గుర్తింపు పొందిన కాలేజీలకు 5 అంచెల్లో గ్రేడ్స్‌ను జారీచేస్తారు.
- 1 నుంచి 4 గ్రేడ్లు పొందిన విద్యాసంస్థలను జాతీయ విశిష్ట విద్యాకేంద్రాలుగా, ఐదో గ్రేడ్ పొందిన కాలేజీలను గ్లోబల్ ఎక్సలెన్స్ కాలేజీలుగా పరిగణిస్తారు.
- కాలేజీల్లో ఉన్న ప్రమాణాల ఆధారంగా న్యాక్ గుర్తింపు ఇచ్చేవారు. ఇకపై విద్యా సంస్థలను 3 క్యాటగిరీలుగా విభజించి, విశ్వవిద్యాలయాలు, అటానమస్ కాలేజీలు, అనుబంధ కాలేజీలుగా గుర్తిస్తారు.
- న్యాక్ అంటేనే కొన్ని కాలేజీలు భయపడుతున్నాయి. ముఖ్యంగా వసతులు అంతగా లేని కాలేజీలు న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నించడం లేదు. ఇకపై ఈ కాలేజీలను పట్టణ, గ్రామీణ ప్రాంత కాలేజీలుగా విభజించి, నిబంధనలకు అనుగుణంగా సడలింపు ఇస్తారు.
- ఇప్పటి వరకూ న్యాక్ బృందాలు కాలేజీలను స్వయంగా పరిశీలించిన తర్వాతే గుర్తింపు ఇచ్చేవి. అలా కాకుండా ఇకపై ఆన్‌లైన్‌లోనూ పరిశీలించి అనుమతులు ఇవ్వాలని న్యాక్ భావిస్తున్నది.

న్యాక్ గుర్తింపు పొందేలా కాలేజీలను ప్రోత్సహిస్తాం

కాలేజీల గుర్తింపు ప్రక్రియను మరింత సరళీకృతం చేసేందుకు నిబంధనల్లో సమూల మార్పులు చేయాలని న్యాక్ ప్రతిపాదించింది. అన్ని కాలేజీలను న్యాక్ గుర్తింపు పరిధిలోకి తేవడం, నాణ్యతను పెంపొందించడమే దీని ఉద్దేశం. ఈ ప్రతిపాదనపై ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో విస్తృత చర్చ జరిగింది. న్యాక్ గుర్తింపు పొందేలా రాష్ట్రంలోని అన్ని కాలేజీలను ప్రోత్సహిస్తాం. ఎస్ఎస్ఆర్ రిపోర్టు తయారీ కోసం డిగ్రీ కాలేజీలకు రూ.లక్ష చొప్పున గ్రాంట్ మంజూరు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత కాలేజీలు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి

మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి సాధించవచ్చని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ కాచిగూడలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ (టీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్సీ కమిటీ తన నివేదికను పూర్తిచేసి ప్రభుత్వానికి వెంటనే అందించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జీ సదానందంగౌడ్ కోరారు. 5,571 ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని, బీఎడ్, డీఎడ్‌తో నిమిత్తం లేకుండా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు ఆట సదయ్య, గజేందర్, ఏవీ సుధాకర్, ఎల్‌ఎం ప్రసాద్, పోల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించాలి: టీపీటీఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక పాఠశాలలకు 10 వేల ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్జీటీలకు టీచర్ ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని ఫెడరేషన్ కోరింది. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఐదు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ నాగిరెడ్డి, ముత్యాల రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారుకు న్యాస్ భయం!

- **నవంబర్ 19న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే**
- **ఈ ఏడాది 3,6,9 తరగతుల విద్యార్థులపై సర్వే**

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లోని అభ్యసనా సామర్థ్యాలు, ప్రతిభను పరీక్షించేందుకు కేంద్రం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష భయం రాష్ట్రప్రభుత్వాన్ని పీడిస్తుంది. మూడేండ్లకొకసారి ఈ సర్వేను కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లు అన్నింటిలోనూ 3, 6, 9 తరగతులకు న్యాస్ సర్వేను నిర్వహించనున్నారు. కాగా, గతంలో 2021లో విడుదల చేసిన న్యాస్ ఫలితాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవు. చదువులపై కరోనా ప్రభావం పడటంతో అప్పట్లో ఫలితాల్లో తెలంగాణ వెనుకబడింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు న్యాస్ ఫలితాలు, ఫెర్ఫార్మెన్స్ గ్రేడెడ్ ఇండెక్స్(పీజీఐ)లను సాకుగా చూపిస్తూ విద్యలో తెలంగాణ 31వ స్థానంలో ఉందంటూ ఆరోపణలు గుప్పించింది. ఈ ఏడాది సర్వేలో వెనుకబడితే అప్రతిష్ట మూటగట్టుకోవాల్సి వస్తుందన్న టెన్షన్ కాంగ్రెస్ సర్కారులో కనిపిస్తున్నది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డియే విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. దీంతో ఫలితాల్లో వెనుకబడితే ఇబ్బందులు తప్పవన్న భావన సర్కారులో నెలకొన్నది. ప్రత్యేకంగా తయారుచేసిన న్యాస్ మాడల్ పేపర్లను విద్యార్థులకు అందించి ప్రాక్టీస్ చేయించే యోచనలో అధికారులు ఉన్నారు. దీని ద్వారా మెరుగైన గ్రేడ్ సాధించవచ్చని భావిస్తున్నారు. ఆగస్టు నెల రెండోవారం గడుస్తున్నా ఇంకా పాఠశాల విద్యాశాఖ బదిలీలు, పదోన్నతుల నుంచి బయటికిరాలేదు. నవంబర్ 19న న్యాస్ పరీక్ష ఉండటంతో దీని ప్రభావం సైతం పడుతుందని సర్కారు టెన్షన్‌పడుతున్నది.

ఇంటర్ సెకండియర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- **ఈ ఏడాది నుంచి అమలు**

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్ దశలోనే విద్యార్థులు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు అర్జించేలా తర్ఫీదునిచ్చేందుకు, ఇంగ్లిష్‌పై విద్యార్థుల్లోని భయాన్ని తొలగించేందుకు ఇంటర్‌బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. సెకండియర్ ఇంగ్లిష్‌లోనూ ప్రాక్టికల్స్‌ను అమలుచేస్తుంది. నిరుడు ఫస్టియర్‌లో ప్రాక్టికల్స్‌ను విజయవంతంగా అమలు చేయగా, ఈ ఏడాది సెకండియర్ విద్యార్థులకు విస్తరించారు. ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టం(ఐఈఎల్‌టీఎస్) ఎగ్జామ్ తరహాలో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. తాజా విధానంతో ఆర్ట్స్, సైన్స్, ఒకేషనల్ కోర్సులన్న తేడాలేకుండా అందరికీ ప్రాక్టికల్స్ తప్పనిసరి అయ్యాయి. ఇంగ్లిష్ సబ్జెక్టుకు 80 మార్కులు థియరీ, 20మార్కులు ప్రాక్టికల్స్‌కు కేటాయిస్తారు. థియరీ ప్రశ్నపత్రాన్ని 80 మార్కులకు కుదించడంతో ప్రశ్నపత్రం స్వరూపం మారింది. మాదిరి ప్రశ్నపత్రాన్ని ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సంక్షేమ హాస్టళ్ల మెస్‌చార్జీలు పెంచాలి

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలను పెంచాలని, బిల్లులను గ్రీన్ చానల్ పద్ధతిలో చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులతో కలిసి ఆదివారం హైదరాబాద్ బర్కత్‌పురా నుంచి వైఎంసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆరేండ్ల క్రితం ధరల ప్రకారమే మెస్ చార్జీలను చెల్లిస్తున్నారని, ధరలు పెరగడంతో కాంట్రాక్టర్లు నాసిరకం ఆహారం పెడుతున్నారని ధ్వజమెత్తారు. మెనూ పాటించడం లేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ర్యాలీలో నాయకులు అర్జున్, ప్రవీణ్, రుద్ర, అభి, చరణ్ పాల్గొన్నారు.



కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్

కేయూ ఎగ్జామినేషన్ అధికారుల తప్పిదం

- **సర్టిఫికెట్స్‌లో బీకాం కంప్యూటర్స్‌కు బదులు బీకాం**
- **అయోమయంలో విద్యార్థులు**

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 11 : కాకతీయ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. మూడేండ్లు కష్టపడి చదివి సంతోషంగా సర్టిఫికెట్స్ తీసుకునే సమయంలో చదివింది ఒక్కటైతే సర్టిఫికెట్‌లో మరొకటి రావడంతో అవాక్కయ్యారు. అధికారుల తప్పిదం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో 100కు 105 మార్కులు కూడా వేసిన ఘనత కాకతీయ విశ్వవిద్యాలయానికే దక్కింది. విద్యార్థులు పరీక్షకు హాజరై రాసినా కూడా గైర్హాజరైనట్లు ఫెయిల్ చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ప్రశ్నపత్రం ఇచ్చారు. ఇటీవల ఆన్సర్ బుక్‌లెట్లు మార్చిన ఘటన కేయూలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పరీక్షల విభాగంలో జరిగిన తాజా పరిణామాలు చూస్తే విద్యార్థులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

బీకాం కంప్యూటర్స్‌కు బదులు బీకాం..

వర్సిటీ పరీక్ష విభాగం తప్పిదం వల్ల బీకాం కంప్యూటర్స్ పూర్తిచేసిన విద్యార్థులకు బీకాం సర్టిఫికెట్ రావడంతో అయోమయానికి గురయ్యారు. 80 మంది విద్యార్థులకు బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ అని ఉండాల్సిన సర్టిఫికెట్లలో బీకాం పూర్తి చేసినట్టు ఇచ్చారు. ఇదేంటని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతిని నిలదీశారు.

మళ్లీ కొత్త మెమోలు జారీ చేస్తాం

సర్టిఫికెట్స్ ముద్రించే క్రమంలో ఎక్కడో తప్పిదం జరిగింది. బీకాం కంప్యూటర్స్‌కు బదులు సర్టిఫికెట్‌లో బీకాం అని వచ్చినట్టు తెలిసింది. ఈ విషయమై సిబ్బందిని మందలించాం. మళ్లీ కొత్త సర్టిఫికెట్స్ ప్రింట్ తీసి కాలేజీకి పంపిస్తున్నాం.

– ప్రొఫెసర్ నర్సింహాచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి


త్వరలోనే ఓవర్సీస్ స్కీం నిధులు

- **తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు**
- **బీసీ సంక్షేమశాఖ వెల్లడి**
- **'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందన**

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఎక్కువ మందికి వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, దీంతో నిధుల విడుదలలో జాప్యమవుతున్నదని బీసీ సంక్షేమశాఖ స్పష్టంచేసింది. అర్హుల జాబితా ప్రకటన, నిధుల విడుదలలో జాప్యం అంశంపై ఇటీవల 'విదేశీ విద్యానిధి ఎప్పుడు?' పేరిట 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన బీసీ సంక్షేమశాఖ ఆదివారం పకటన విడుదల చేసింది. ఓవర్సీస్ స్కీంకు సంబంధించి ఈ ఏడాది ఎంపిక ప్రక్రియను మార్చి 2024లోనే పూర్తి చేయాల్సి ఉన్నదని, ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగిందని తెలిపింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏటా 300 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చేదని, ప్రస్తుతం ఆ సంఖ్యను రెండింతలు లేదంటే మూడింతలు చేయాలని సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఆలోచిస్తున్నదని వెల్లడించింది. అర్హుల ఎంపికను ఒకేసారి రిలీజ్ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని వివరించింది. ఇప్పటికే స్కాలర్‌షిప్ మొదటి దశ పేమెంట్ పొందినవారికి రెండో దశ పేమెంట్ పూర్తి చేసేందుకు ఆర్థికశాఖను సంప్రదించామని, త్వరలోనే నిధులు విడుదల చేస్తారని తెలిపింది. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీసీ సంక్షేమశాఖ హామీ ఇచ్చింది.

రాబడి

నెలకు రూ.6,400తో కోటిన్నర రిటైర్మెంట్ ఫండ్



ప్రస్తుతం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) వార్షిక వడ్డీరేటు ఆకర్షణీయంగా ఉన్నది. 8.25 శాతంగా అమలవుతున్నది. దీంతో నెలకు రూ.6,400 చొప్పున 35 ఏండ్లు చెల్లిస్తే.. మెచ్యూరిటీ సమయంలో దాదాపు రూ.1.52 కోట్లు అందుకోవచ్చు. అలాగే రూ.10,600తో రూ.2.51 కోట్లు పొందవచ్చు. అయితే రూ.12,500 చొప్పున 37 ఏండ్లు చెల్లిస్తే రిటైర్మెంట్ వయసులో రూ.3.5 కోట్లు తీసుకోవచ్చు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) అనేది ఉద్యోగుల కోసం ఉన్న సురక్షిత ప్రభుత్వ పొదుపు పథకం. నెలనెలా వేతన జీవులు కొంత మొత్తాలను చెల్లిస్తే.. పదవీ విరమణ తర్వాత ఒకేసారి పెద్ద మొత్తంలో లభిస్తుంది. కాగా, ఈపీఎఫ్‌పై వడ్డీరేటును కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్ణయిస్తూ ఉంటుంది. సాధారణంగా 58 ఏండ్లు దాటితే గానీ లబ్ధిదారునికి ఈపీఎఫ్‌వో పెన్షన్ రాదు. ముందస్తు పెన్షన్ కావాలంటే కనీసం 50 ఏండ్లైనా దాటాలి. 58 ఏండ్లు దాటిన తర్వాత రెండేండ్లు వాయిదా వేసుకోవచ్చు. దానికి ఏటా 4 శాతం అదనపు వడ్డీరేటు లభిస్తుంది.

గణాంకాలే కీలకం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం భారీగా నష్టపోయాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,276.04 పాయింట్లు లేదా 1.57 శాతం కోల్పోయి 79,705.91 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 350.20 పాయింట్లు లేదా 1.41 శాతం దిగజారి 24,367.50 దగ్గర నిలిచింది. దేశ-విదేశాల్లో ప్రతికూల పరిణామాలు, ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో సూచీలు కదలాడుతుండటం.. మదుపరులను లాభాల స్వీకరణ వైపునకు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ఒడిదొడుకులకు వీలున్నదనే చెప్పవచ్చు. ద్రవ్యోల్బణం, వాణిజ్య గణాంకాలు కీలకం కానున్నాయి. ఇక వరుసగా 9వసారీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచినందున ఆ ప్రభావంతో బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు నష్టాలకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక మందగమనం నడుమ ఐటీ రంగ షేర్లకూ ఎదురుదెబ్బే. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,900-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



ఎల్‌టీసీజీ ట్యాక్స్‌లో ఏది లాభం?




స్థిరాస్తి విక్రయాలపై పాత, కొత్త పన్ను విధానాలు ఏమిటి?

ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గత నెల 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రకటించిన దగ్గర్నుంచి లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్ను మాట అందరి నోటా వినిపిస్తున్నది. 2001 ఏప్రిల్ 1 నుంచి కొన్న ఇండ్లను ఇకపై అమ్మితే.. ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలంటూ బడ్జెట్‌లో మంత్రి చేసిన ప్రకటనే ఇందుకు కారణం.

ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

ఇండెక్సేషన్ బెనిఫిట్ (ద్రవ్యోల్బణం ప్రయోజనం)ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నెంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 ఆర్థిక సంవత్సరం నుంచి (2001 ఏప్రిల్ 1 మొదలు) ప్రతీ ఆర్థిక సంవత్సరం కొత్త సీఐఐ సిరీస్ నెంబర్లను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02లో ఇల్లు కొనడానికి మీరు పెట్టిన ప్రతీ లక్ష రూపాయల విలువ.. ప్రస్తుతం రూ.3.63 లక్షలతో సమానం. ఒకవేళ నాడు రూ.5 లక్షలకు కొంటే.. ఇప్పుడు దాని విలువ రూ.18.15 లక్షలు. ఇంతకన్నా ఎక్కువ ధరకు మీ ఇల్లును అమ్ముకుంటే, ఆ మొత్తంపై మాత్రమే ఎల్‌టీసీజీ ట్యాక్స్ వర్తిస్తుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. దీన్ని తీసేస్తా



మని, దానికి బదులుగా పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి (7.5 శాతం) తగ్గిస్తామని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వర్గాలు, ఇండస్ట్రీ నిపుణుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతే వ్యక్తమైంది. దీనికి తలొగ్గిన మోదీ సర్కారు.. బడ్జెట్‌లో తాము తెచ్చిన కొత్త పన్ను విధానం, ఇప్పటికే ఉన్న పాత పన్ను విధానం రెండూ అమల్లో ఉంటాయని, ఏది లాభమైతే దాన్ని ట్యాక్స్ పేయర్స్ ఎంచుకోవచ్చని గత వారం పార్లమెంట్‌లో సభ్యులకు పంచిన ఆర్థిక బిల్లు-2024 సవరణ డాక్యుమెంట్లలో చెప్పింది. అసలు ఈ రెండు విధానాలు ఎలా ఉన్నాయి? ఇందులో ఏది లాభం? అనేది పక్కనున్న బాక్స్‌లో పరిశీలించవచ్చు.

చివరగా..

బడ్జెట్‌కు ముందు (ఈ ఏడాది జూలై 23) ఇల్లు కొని, వాటిని ఇప్పుడు అమ్ముతున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్‌యూఎఫ్)వారికే ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను ఎంచుకునే వీలుంటుందని ఆర్థిక బిల్లు సవరణలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని ప్రకారం గత నెల 23 లేదా ఆ తర్వాత ఇండ్లు కొన్నవారు భవిష్యత్తులో వాటిని అమ్ముకుంటే ఇండెక్సేషన్ బెనిఫిట్ వర్తించదన్నమాట. అంటే అధిక ఎల్‌టీసీజీ ట్యాక్స్ భారాన్ని మోయక తప్పదు.

పాత పన్ను ప్రకారం

2014-15లో రూ.40 లక్షలతో మహేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 240గా ఉన్నది. ఈ ఏడాది జూన్‌లో దాన్ని రూ.75 లక్షలకు అమ్మేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/240= 1.5125 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.40 లక్షలతో గుణిస్తే.. రూ.60,50,000గా ఉంటుంది. ఇదిప్పుడు మహేశ్ ఇంటి విలువ అన్నమాట. ఇక ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.75,00,000 నుంచి ఈ రూ.60,50,000ను తీసేయాలి. అప్పుడు రూ.14,50,000 మిగులుతుంది. దీనిపైనే ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.2.90 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం


అమ్మిన ధర రూ.75 లక్షల నుంచి కొన్న ధర రూ.40 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.35 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.4,37,500 కట్టాలి. పాత పన్ను ప్రకారం చెల్లింపుతో చూస్తే ఈ కొత్త పన్ను ప్రకారం మీపై రూ.1,47,500 అదనపు భారం పడుతున్నదన్నమాట. ఎల్‌టీసీజీ పన్ను చెల్లింపుల్లో ఇండెక్సేషన్ బెనిఫిట్ ఉండటం వల్ల పాత పన్ను విధానంలో ట్యాక్స్ పేయర్లకు కలిగే లాభం, దాన్ని తీసేయటం వల్ల కొత్త పన్ను విధానంలో వచ్చే నష్టం ఇదే. కాబట్టి మహేశ్ పాత పన్ను విధానాన్ని ఎంచుకుని ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను చెల్లిస్తే రూ.1,47,500 మిగులుతుంది. అలా కాదని, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకుంటే ఆ మేరకు నష్టపోవాల్సి వస్తుంది.

2001 ఏప్రిల్ 1కి ముందు..

గత నెల ప్రకటించిన బడ్జెట్‌లో 2001 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత కొన్న ఇండ్ల అమ్మకాలపైనే ఎల్‌టీసీజీ ట్యాక్స్ లెక్కింపులో మార్పులు చేశారు. అయితే అంతకుముందు మాటేమిటి? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తకమానదు. 2001 మార్చి 31లోపు కొన్న ఇండ్ల విక్రయాలకు 1981-82 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరం మధ్య ఉన్న ఐటీ శాఖ పాత సీఐఐ నెంబర్ సిరీస్ ఆధారంగా ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను లెక్కిస్తారు. అయితే ఇప్పుడు అమ్ముకున్నా 2016-17 సీఐఐ నెంబరే వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. దీనికి ఇటీవలి బడ్జెట్ సవరణలతో పనిలేదు. కాబట్టి 2001 మార్చి 31లోపు ఇండ్లు కొన్నవారు పాత సీఐఐ నెంబర్ల ప్రకారమే తమ స్థిరాస్తి క్రయవిక్రయాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లించవచ్చు.

ఇదీ లెక్క..

ఉదాహరణకు 1984 జూన్‌లో మీరు రూ.2 లక్షలు పెట్టి ఇల్లు కొన్నారు. అప్పుడు సీఐఐ నెంబర్ 125గా ఉన్నది. ఈ ఏడాది జూన్‌లో దాన్ని రూ.25 లక్షలకు అమ్మేశారు. దీనికి పాత సీఐఐ సిరీస్‌లో ఆఖరుదైన 2016-17 ఆర్థిక సంవత్సరం సీఐఐ నెంబర్ 1,125 వర్తిస్తుంది. అంటే ఇల్లు అమ్మిన సంవత్సరం సీఐఐ 1,125 నుంచి ఇల్లు కొన్న సీఐఐ 125ను భాగించాలి. అప్పుడు 9 వస్తుంది. దీన్ని ఇల్లు కొన్న ధర రూ.2 లక్షలతో గుణించాలి. రూ.18 లక్షలు వస్తుంది. ఇదే ఇప్పుడు మీ ఇల్లు విలువ. మీరు అమ్మిన రూ.25 లక్షల నుంచి ఈ రూ.18 లక్షలను తీసేస్తే మిగిలే ఆ రూ.7 లక్షలపైనే 20 శాతం ఎల్‌టీసీజీ ట్యాక్స్ చెల్లించాలి. దీని ప్రకారం రూ.1.4 లక్షలు చెల్లిస్తే చాలు.



1981 ఏప్రిల్ 1కి ముందైతే..

1981 మార్చి 31 లేదా అంతకు ముందు కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్ముకుంటే దానికి ఎల్‌టీసీజీ పన్నును కట్టేందుకు 1981-82 నుంచి 2016-17 మధ్య ఉన్న సీఐఐ నెంబర్లే వర్తిస్తాయి. అప్పుడు ఇల్లు కొన్నప్పటి సీఐఐ నెంబర్‌గా 1981-82కు చెందిన ప్రారంభ నెంబర్ 100ను పరిగణిస్తారు. 2017 మార్చి 31లోపు అమ్మితే ఆయా ఆర్థిక సంవత్సరాల సీఐఐలను చూస్తారు. ఆ తర్వాత విక్రయిస్తే పాత సిరీస్ చివరి సీఐఐ నెంబర్ 1,125 వర్తిస్తుంది. ఒకవేళ పాత సీఐఐ సిరీస్ వద్దనుకుంటే కొత్త సీఐఐ సిరీస్‌నూ ఎంచుకోవచ్చు. కానీ మీ ఇంటి విలువను ఓ రిజిస్టర్డ్ అప్రైజర్‌తో లెక్క కట్టించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫెయిర్ మార్కెట్ వాల్యూ (ఎఫ్ఎంవీ)ను సదరు అప్రైజర్ లెక్కిస్తారు. అప్పుడు మీ ఇల్లు కొన్న సీఐఐ నెంబర్ 2001-02కు చెందిన 100గా పరిగణిస్తారు. ఒకవేళ 2010-11లో అమ్ముకుంటే అప్పటి సీఐఐ 167, ఇప్పుడు అమ్ముకోవాలనుకుంటే 2024-25 సీఐఐ 363 ఆధారంగా ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను లెక్కిస్తారు.

ఇదీ సంగతి..

ఉదాహరణకు 1950లో కొన్న మీ ఇంటి ఫెయిర్ మార్కెట్ వాల్యూను రిజిస్టర్డ్ అప్రైజర్ రూ.15 లక్షలుగా తేల్చారు. ఇప్పుడు దాన్ని రూ.70 లక్షలకు అమ్ముకున్నారు. దీంతో ఇంటిని అమ్మిన సీఐఐ 363తో ఇంటిని కొన్న సీఐఐ 100ను భాగించాలి. అప్పుడు 3.63 వస్తుంది. దీన్ని ఇంటి ఎఫ్ఎంవీ రూ.15 లక్షలతో గుణించాలి. అప్పుడు రూ.54.45 లక్షలుగా ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్ ప్రకారం ఇదే మీ ఇంటి ప్రస్తుత విలువ. అమ్మిన రూ.70 లక్షల నుంచి దీన్ని తీసేయాలి. మిగిలిన రూ.15.55 లక్షలకు 20 శాతం ఎల్‌టీసీజీ ట్యాక్స్ చెల్లించాలి. దీని ప్రకారం రూ.3.11 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.



చైనాలో 'ప్రెగ్నెంట్' కార్లు!

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రెగ్నెంట్ కార్లు..! అదేంటి.. కార్లకు గర్భం రావడమేంటి? అనుకుంటున్నారా? చైనాలో ఠారెత్తిస్తున్న ఎండలు అటు పౌరులనే కాదు, ఇటు కార్లను కూడా నానా ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. కార్ల రక్షణకు వేసిన ప్రొటెక్టివ్ ఫిల్మ్ అధిక వేడికి వ్యాకోచం చెంది కారుకు గర్భమొచ్చినట్టు బాయ్‌నెట్ ప్రాంతంలో పైకి ఎగదన్నుతున్నాయి. ఆడీ లాంటి ఖరీదైన కార్లకు కూడా ఇది తప్పడం లేదు. గర్భం దాల్చినట్టు ఉన్న కార్లకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్ కాగా, కొందరు వీటిని 'ప్రెగ్నెంట్ కార్లు'గా వ్యవహరిస్తున్నారు. చైనా కార్లు కొంటున్నారా? వాతావరణం వేడిగా ఉంటే వాటికి గర్భమొస్తుంది జాగ్రత్త' అని చైనా ఎక్స్‌పర్ట్ రిపోర్టర్ జెన్నీఫర్ జెంగ్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.



గాయాల్ని వేగంగా మాన్పే ఎలక్ట్రిక్ బ్యాండేజీ

వాషింగ్టన్: కొన్ని గాయాలు ఎంతకీ తగ్గవు. ముఖ్యంగా ఈ సమస్య డయాబెటిక్ రోగుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారి కోసం 'ఎలక్ట్రిక్ బ్యాండేజ్'ని నార్త్ కరోలినా స్టేట్ వర్సిటీ సైంటిస్టులు తయారుచేశారు. తీవ్ర గాయాలను సైతం ఈ బ్యాండేజ్‌లు నయం చేయగలవని, సాధారణ బ్యాండేజ్‌లతో పోల్చితే 30% వేగంగా పుండు లేదా గాయం నుంచి ఉపశమనం లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. గాయంపై ఈ బ్యాండేజ్‌ని అతికించగానే, ఒక్క నీటి బిందువుతో బ్యాండేజ్‌లోని బ్యాటరీ యాక్టివేట్ అవుతుంది. దీంతో గాయం చుట్టూ విద్యుత్తు క్షేత్రం ఏర్పడి.. కొన్ని గంటల్లో తగ్గడానికి ఆస్కారముందని చెబుతున్నారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో గాయాలు వేగంగా తగ్గాయట! 'దీర్ఘకాలిక గాయాలతో బాధపడే రోగుల వైద్య చికిత్స వేగవంతం చేయటమే మా పరిశోధన లక్ష్యం' అని పరిశోధకుల్లో ఒకరు బండోద్కర్ చెప్పారు.



5 నిమిషాల్లో 100% చార్జింగ్

బీజింగ్: స్మార్ట్‌ఫోన్లు నిత్య జీవితంలో కీలకంగా మారాయి. వీటి చార్జింగ్ అయిపోతే.. దిక్కుతోచని పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి వారి కోసం చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ 'రియల్‌మీ' సరికొత్త ఫాస్ట్ చార్జింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. కేవలం 5 నిమిషాల్లో స్మార్ట్‌ఫోన్‌ను 100 శాతం చార్జింగ్ అయ్యేలా చేసే కొత్త టెక్నాలజీని సిద్ధం చేసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 300 డబ్ల్యూ (వూక్) చార్జింగ్ సామర్థ్యం కలిగిన టెక్నాలజీని షెన్‌జెన్‌లో(ఆగస్టు 13 నుంచి) ప్రారంభమవుతున్న 'టెక్ ఫెస్టివల్'లో పరిచయం చేయబోతున్నట్టు తెలిసింది. 'ఫాస్ట్ చార్జింగ్‌లో రికార్డ్ బ్రేక్ చేయబోతున్నాం' అంటూ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా కంపెనీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ టెక్నాలజీతో స్మార్ట్‌ఫోన్ల చార్జింగ్ 0 నుంచి 50శాతం మూడు నిమిషాల్లో, 100శాతం ఐదు నిమిషాల్లో అవుతుందట!

బంగ్లా అల్లర్ల వెనుక అమెరికా!

- మాజీ ప్రధాని హసీనా సంచలన ఆరోపణలు
- సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అప్పగించుంటే తన ప్రభుత్వం కొనసాగేదని వ్యాఖ్య
- ప్రధానిగా రాజీనామా తర్వాత జాతినుద్దేశించి చేయాలనుకొన్న ప్రసంగంలో హసీనా వెల్లడి
- అలాంటి ప్రసంగం లేదన్న కుమారుడు సాజీద్



ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన తిరుగుబాటు, అల్లర్ల వెనుక అమెరికా హస్తం ఉన్నదని మాజీ ప్రధాని షేక్ హసీనా చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. తనకు వ్యతిరేకంగా అమెరికా కుట్ర చేసిందని, సెయింట్ మార్టిన్స్ ద్వీపం కోసమే ఇదంతా చేసిందని వెల్లడించారు. తాను గనుక వ్యూహాత్మకమైన సెయింట్ ద్వీపాన్ని అమెరికాకు అప్పగించి ఉంటే.. తన ప్రభుత్వం కొనసాగేదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలు, అల్లర్ల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధానిగా రాజీనామా చేయకముందు, భారత్‌కు రాకముందు షేక్ హసీనా జాతినుద్దేశించి మాట్లాడాలనుకొన్నారు. కానీ అమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక ఆందోళనలు కొనసాగుతున్న క్రమంలో సైనిక ఉన్నతాధికారులు అందుకు అనుమతించలేదు. ఆమె జాతినుద్దేశించి చేయాల్సిన ప్రసంగం తాజాగా బయటకు వచ్చిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వార్తా నివేదికలను హసీనా కుమారుడు సాజీద్ వాజెబ్ ఖండించారు. అవి పూర్తిగా కల్పితమని, తప్పు అని ఆదివారం రాత్రి ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఢాకాను వీడేముందు, తర్వాత ఏ విధమైన ప్రకటన ఇవ్వలేదని తన తల్లి చెప్పారన్నారు.


శవాల ఊరేగింపును చూడాలనుకోలేదు..

తాను మాట్లాడాలనుకొన్న అంశాల గురించి హసీనా తన సన్నిహితులతో చెప్పారని, ఆమె మాట్లాడలేకపోయిన తన ప్రసంగం బయటకొచ్చిందని పలు మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ మార్పునకు అమెరికా కుట్ర చేసిందని ఆరోపించారు. 'శవాల ఊరేగింపును తాను చూడాలనుకోలేదు. విద్యార్థుల మృతదేహాలపై నడుచుకుంటూ అధికారంలోకి రావాలని వాళ్లు అనుకొన్నారు. అయితే నేను దాన్ని అనుమతించలేదు. ప్రధాని పదవికి రాజీనామా చేశాను. సెయింట్ మార్టిన్ ద్వీపం సార్వభౌమాధికారాన్ని గనుక నేను అమెరికాకు అప్పగించి ఉంటే, బంగాళాఖాతంపై ఆ దేశానికి పట్టు కల్పించి ఉంటే తాను అధికారంలో కొనసాగేదాన్ని. దయచేసి అతివాదుల మాయలో పడొద్దని దేశ ప్రజలను కోరుతున్నాను' అని హసీనా పేర్కొన్నారు. తాను దేశంలోనే ఉంటే మరిన్ని ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని, అందుకే తాను పదవి నుంచి దిగిపోతున్నానని అన్నారు.

త్వరలో దేశానికి తిరిగొస్తాను

జాతినుద్దేశించి చేయలేకపోయిన ప్రసంగంలో హసీనా తన పార్టీ నేతలు, కార్యకర్తలకు కూడా సందేశం ఇచ్చారు. అవామీ లీగ్ పార్టీ తిరిగి నిలబడుతుందని, ఆశ కోల్పోవద్దని, తాను త్వరలో దేశానికి తిరిగి వస్తానని పేర్కొన్నారు. అవామీ లీగ్ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకోవడం తనకు చాలా బాధగా ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులను తాను రజాకార్లు అని పిలువలేదని ఈ సందర్భంగా ఆమె వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

సెయింట్ మార్టిన్స్ ద్వీపం ప్రాధాన్యమేంటి?



సెయింట్ మార్టిన్స్ ద్వీపం విస్తీర్ణం కేవలం 3 చదరపు కిలోమీటర్లు. 3,700 మంది నివాసం ఉంటారు. వీరంతా చేపల వేట, వరి, కొబ్బరి సాగు, సముద్రపు పాచి సేకరణపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ ద్వీపం బంగాళాఖాతం సముద్రానికి ఈశాన్యంలో, బంగ్లాదేశ్‌కు దక్షిణాన తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలో ఉండే సెయింట్ మార్టిన్స్ బంగ్లాదేశ్‌కు ఉన్న ఏకైక ద్వీపం. ఇది 1947 వరకు బ్రిటీష్ ఇండియాలో భాగంగా, ఆ తర్వాత పాకిస్థాన్ నియంత్రణలోకి, అనంతరం 1971లో బంగ్లాదేశ్‌లో ఒక భాగమైంది. దీనికి సంబంధించి బంగ్లాదేశ్, మయన్మార్ మధ్య 1974లో ఒప్పందం కుదిరినప్పటికీ, ద్వీపం సముద్రపు సరిహద్దు విభజనపై వివాదం ఉండేది. సెయింట్ మార్టిన్ ద్వీపంపై అంతర్జాతీయంగా ప్రధానంగా అమెరికా, చైనా దృష్టి సారించాయి. రీజియన్‌లో తమ ఉనికి బలోపేతం చేసుకొనేందుకు ఈ ద్వీపాన్ని ఉపయోగించుకోవాలనుకొన్నాయి. ఈ ద్వీపంలో ఎవరు మిలటరీ బేస్‌ను నిర్మించుకొన్నా చైనా ప్రధానంగా రవాణాకు ఉపయోగించే మలక్కా జలసంధిపై వ్యూహాత్మక ఉనికి కలిగి ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరిస్తే బదులుగా సెయింట్ మార్టిన్స్‌లో మిలటరీ బేస్‌ను కట్టుకొనేందుకు ద్వీపాన్ని అమెరికాకు అమ్మేసేలా మాజీ ప్రధాని ఖాలిదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) ప్లాన్ వేసిందనే ఆరోపణల తర్వాత ఈ ద్వీపంపై అందరి దృష్టి పడింది. ఈ ఆరోపణలను అమెరికా ఖండించింది.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఒకే వర్గానికి చెందిన నలుగురు మృతి

ఇంఫాల్, ఆగస్టు 11: మణిపూర్‌లో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. తెంగ్నోపాల్ జిల్లాలోని ఓ గ్రామంలో యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్ మిలిటెంట్లకు, అదే సామాజిక వర్గానికి చెందిన గ్రామ వాలంటీర్లకు మధ్య శుక్రవారం మల్నోమ్ ప్రాంతంలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు వాలంటీర్లు, ఒక మిలిటెంట్ మృతి చెందారు. దీంతో ఆగ్రహం చెందిన వాలంటీర్లు యూకేఎల్‌ఎఫ్‌కు చీఫ్‌గా ప్రకటించుకున్న ఎస్‌ఎస్ హాకోపి గృహాన్ని దహనం చేశారు. పల్లెల ప్రాంతంలో రుసుంల వసూళ్లపై ఆధిపత్యం కోసమే ఈ కాల్పులు జరిగినట్టు భావిస్తున్నారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

109 రకాల కొత్త వంగడాలు

ఆవిష్కరించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకోగల, అధిక దిగుబడినిచ్చే 109 రకాల కొత్త వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం ఆవిష్కరించారు. వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంపొందించటంలో భాగంగా ఈ విత్తన రకాలను దేశవ్యాప్తంగా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు సంబంధించి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) 61 రకాల పంటలకు సంబంధించి 109 రకాల విత్తనాలను అభివృద్ధి చేసింది.



విదేశాంగ మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత

న్యూఢిల్లీ: విదేశాంగ మాజీ మంత్రి కే నట్వర్ సింగ్ (93) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన చాలా కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు వారాల నుంచి గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. నట్వర్ సింగ్ రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో 1931లో జన్మించారు. ఆయన దౌత్యవేత్తగా జీవితాన్ని ప్రారంభించారు. దౌత్య రంగంలో సాధించిన అనుభవాన్ని రాజకీయ రంగానికి జోడించి సేవలందించారు. ఆయనకు 1984లో 'పద్మభూషణ్' పురస్కారం లభించింది. 2004-05 మధ్య కాలంలో యూపీఏ-1 ప్రభుత్వంలో ఆయన విదేశాంగ మంత్రిగా పని చేశారు.



జాక్వెలిన్‌కు బర్త్‌డే గిఫ్ట్‌గా లగ్జరీ నౌక!

న్యూఢిల్లీ: ఈ నెల 11న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ బర్త్‌డే సందర్భంగా ఆమెకు ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ లగ్జరీ నౌకను కానుకగా ఇవ్వనున్నాడట. అలాగే ఆమె అభిమానులకు 100 ఐఫోన్లను బహుమతులుగా పంపాడట. ఈ మేరకు అతడు జాక్వెలిన్‌కు లేఖ రాశాడు. 'మై బేబీ గర్ల్, మై బొమ్మ వెరీ వెరీ హ్యాపీ బర్త్‌డే. లేడీ జాక్వెలిన్(నౌక పేరు)ను నీకు పంపుతున్నా. ఇదే నెలలో అది నీకు అందుతుంది. చట్టబద్ధంగా అన్ని పన్నులు చెల్లించాను. వచ్చే ఏడాది బర్త్‌డే వేడుక ఇద్దరం కలిసి చేసుకుందాం' అని లేఖలో పేర్కొన్నాడు.

ఫోన్ బానిసత్వాన్ని దూరం చేసే చాస్టిటీ బెల్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: పొద్దున నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకొనేదాకా.. ఫోన్ లేనిదే క్షణం గడవని పరిస్థితి. ఫోన్‌కు అంతలా బానిసలుగా మారిపోయాం. ఈ బానిసత్వాన్ని దూరం చేసేలా చాస్టిటీ బెల్ట్‌ను 'ది కోచ్' యాప్ నిర్వాహకులు అభివృద్ధి చేశారు. ఈ బెల్ట్ అచ్చం.. మధ్యయుగ కాలంలో శృంగారం నుంచి మహిళలను కట్టడి చేసేందుకు వాడిన చాస్టిటీ బెల్ట్‌ను పోలి ఉండటం గమనార్హం. ఆ బెల్ట్‌కు కొంచెం ఆధునికతను జోడించి ఫోన్, కంప్యూటర్ కోసం తయారుచేశారు. దీన్ని రూ.8 వేలకు ది కోచ్ యాప్ ద్వారా విక్రయిస్తున్నారు. ఈ బెల్ట్‌ను ఫోన్/కంప్యూటర్‌కు తగిలించి, తాళం వేయాలి. తాళం చెవిని నమ్మకస్థులకు ఇచ్చి బానిసత్వాన్ని దూరం చేసుకోవచ్చు అంటున్నారు నిర్వాహకులు. ఫోన్ వ్యసనాన్ని నిరోధించేందుకు ఇలాంటి పరికరం తీసుకురావడం ప్రపంచంలో ఇదే తొలిసారని వారు చెబుతున్నారు.



ఐఈఆర్ డైట్‌తో ఊబకాయానికి చెక్

బీజింగ్, ఆగస్టు 11: ఊబకాయం సమస్యను పరిష్కరించుకునేందుకు దోహదపడే గొప్ప విజయాన్ని శాస్త్రవేత్తలు సాధించారు. క్యాలరీల స్వీకరణను పరిమితం చేయడం ద్వారా ఉదరం, మెదడులో గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయని, ఇది ఆరోగ్యకరమైన రీతిలో శరీర బరువును తగ్గించుకునేందుకు సరికొత్త మార్గాలను తెరుస్తుందని కనుగొన్నారు. అడపా దడపాగా శక్తిని పరిమితం చేసే ఐఈఆర్ (ఇంటర్‌మిట్టెంట్ ఎనర్జీ రెస్ట్రిక్షన్) కార్యక్రమాన్ని చైనా పరిశోధకులు నిర్వహించారు. కొన్ని రోజులపాటు పరిమితంగా క్యాలరీలను తీసుకోవడం, ఉపవాసంతో కూడిన ఈ ప్రక్రియలో ఊబకాయులైన 25 మంది వలంటీర్లు 62 రోజులపాటు పాల్గొన్నారు. దీంతో వారు 7.6 కిలోల బరువు తగ్గారు. ఇది వారి మొత్తం శరీర బరువులో 7.8 శాతానికి సమానమని, ఐఈఆర్ వల్ల ఊబకాయానికి సంబంధించిన మెదడు భాగాల పనితీరు మారడం, ఉదరంలో బ్యాక్టీరియా ఏర్పడటమే వారి శరీర బరువు తగ్గదలకు కారణమని పరిశోధకులు గుర్తించారు.

ఎక్కువగా పళ్లూడిపోతే గుండె జబ్బులు!

న్యూఢిల్లీ: ఎక్కువగా పళ్లూడిపోతే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉన్నదని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. దంతాలు ఊడిపోవడం వల్ల వ్యాధి కారకాలు చిగుళ్లలోకి చొచ్చుకుపోయేందుకు అనుమతి లభిస్తుంది. దీని వల్ల వాటి ప్రసరణ, వాపు పెరుగుతాయి. ఇది గుండెపై ప్రభావం చూపవచ్చు. అయితే దీంతోపాటు ధూమపానం, కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలు లాంటివి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు తెలిపారు. తక్కువ సంఖ్యలో లేదా అసలు దంతాలు కోల్పోని వారితో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో లేదా తమ పళ్లన్నీ కోల్పోయినవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 66 శాతం ఎక్కువని పరిశోధకుల విశ్లేషణలో తేలింది. 12 అధ్యయనాలను విశ్లేషించిన అనంతరం నోటి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడం ద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పరిశోధకులు తెలిపారు.

నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

- ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటన
- కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారంపై నిరసన
- దవాఖానల్లో వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్



ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఆర్.జి.కర్ దవాఖాన వైద్య సిబ్బంది ధర్నా

కోల్‌కతా, ఆగస్టు 11: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారంపై రెసిడెంట్ డాక్టర్లు భగ్గుమన్నారు. హత్యను నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగా పలు రకాల వైద్య సేవలను నిలిపివేయనున్నట్టు ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ప్రకటించింది. 'ఆర్‌జీ కర్‌లోని మా సహచరులకు సంఘీభావంగా సోమవారం దేశవ్యాప్తంగా పలు రకాల వైద్యసేవలు నిలిపివేయాలని నిర్ణయించాం. ఇది తేలికగా తీసుకున్న నిర్ణయం కాదు. ఎలాంటి జాప్యం లేకుండా తమకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నది. ఆర్‌జీ వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని, నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని, బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని, అన్ని దవాఖానల్లో వైద్యుల భద్రతకు కేంద్రం ప్రొటోకాల్ విడుదల చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.

నిందితుడిని పట్టించిన ఇయర్‌ఫోన్

కోల్‌కతాలో ఆర్‌జీ కర్ కాలేజీలో 28 ఏండ్ల ట్రైనీ డాక్టర్ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి అర్ధనగ్న స్థితిలో బాధితురాలి మృతదేహం లభ్యమైంది. ఆమెపై లైంగికదాడి జరిగినట్టు నిర్ధారణ అయింది. నిందితుడు సంజయ్‌రాయ్‌ని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి అతడి విరిగిన ఇయర్‌ఫోన్ వైద్యురాలి హత్య జరిగిన సెమినార్ రూమ్‌లో దొరికింది. అదే అతడిని పట్టించింది. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఎమర్జెన్సీ భవనంలోకి వెళ్తున్నప్పుడు బ్లూటూత్ డివైజ్ అతని మెడలో ఉంది. 40 నిముషాల అనంతరం బయటకు వచ్చేటప్పుడు అది అతడి మెడలో లేదు. కొంతసేపు పెనుగులాట తర్వాత డాక్టర్‌ను గొంతు పిసికి చంపినట్టు నిందితుడు అంగీకరించాడని పోలీసులు చెప్పారు. ఆ సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడన్నారు. సంజయ్ రాయ్‌కు ఇదివరకే నాలుగుసార్లు పెండ్లిండ్లు అయ్యాయి. అయితే అతని ప్రవర్తన కారణంగా ముగ్గురు భార్యలు అతడిని వదిలి వెళ్లిపోగా. నాలుగో భార్య గత ఏడాది మరణించింది. సంజయ్ రాయ్ పోలీస్ పౌర వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. పోకిరీ చేష్టలతో స్థానికులకు ఎప్పుడూ ఇబ్బందులు కలిగించేవాడని తెలిసింది.

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ వేయాలి

మొదటిపేజీ తరువాయి...

మారాయి. 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ ఎక్స్‌లో పేర్కొన్న గంటల వ్యవధిలోనే ఈ బాంబు పేల్చింది. ఈ నేపథ్యంలో సెబీ చైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణ చేయించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ స్కామ్‌ను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ కోరింది. అదానీ కుంభకోణంపై దర్యాప్తు సంస్థగా ఉన్న సెబీ చీఫ్‌పై కూడా ఆరోపణలు వస్తున్న క్రమంలో ఈ మొత్తం వ్యవహారాన్ని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో బచ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సమగ్ర దర్యాప్తు జరిగే వరకు సెబీ చీఫ్‌గా మాధవి బచు తప్పుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

హిండెన్‌బర్గ్ వ్యక్తిత్వ హననం

హిండెన్‌బర్గ్ ఆరోపణలను సెబీ చీఫ్ మాధవి పురీ బచ్, ఆమె భర్త ధావల్ ఖండించారు. సెబీ విశ్వసనీయతను దెబ్బతీయడంతో పాటు దాని చైర్‌పర్సన్ వ్యక్తిత్వ హననానికి హిండెన్‌బర్గ్ సంస్థ ప్రయత్నిస్తున్నదన్నారు. ప్రైవేటు వ్యక్తులుగా తాము ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రమోట్ చేసిన ఫండ్‌లో పెట్టుబడులు పెట్టామని, మాధవి బచ్ సెబీలో పూర్తికాల సభ్యురాలిగా చేరడానికి రెండేండ్ల ముందు ఇది జరిగిందని తెలిపారు. భారత్‌లో పలు ఉల్లంఘనకు సంబంధించి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వని ఆ సంస్థ.. ఈ విధంగా ఎదురుదాడి చేస్తున్నదని ప్రకటనలో పేర్కొన్నారు.

సెబీ చీఫ్‌తో వాణిజ్య సంబంధాలు లేవు: అదానీ గ్రూపు

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది. సెబీ చీఫ్ మాధవి పురీ బచ్‌తో తమ సంస్థకు ఎలాంటి వాణిజ్యపరమైన సంబంధాలు లేవని తెలిపింది. హిండెన్‌బర్గ్ కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నదని కొట్టిపారేసింది. వ్యక్తిగత లాభం కోసం వక్రీకరణలు చేస్తూ మదుపరులను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నదని తెలిపింది. మరోవైపు అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై తగిన విచారణ జరిగిందని, మాధవి పురీ బచ్ ఎప్పటికప్పుడు వివరాలను బహిర్గతం చేస్తూనే ఉన్నారని సెబీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.



ఉత్తర, వాయువ్య భారతంలో భారీ వర్షాలు

28 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉత్తర, వాయువ్య భారతంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు 28 మంది మరణించారు. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి, ఇళ్లు నేలకూలాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హర్యానాలో పలు గ్రామాలు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. రాజస్థాన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 16 మంది మరణించారు. తూర్పు ఢిల్లీలో భారీ వాన పడింది. గురుగ్రామ్‌లో ఒకేరోజు 70 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉత్తరాఖండ్‌లోని భీంబలిలో భారీయెత్తున కొండచరియలు కూలాయి. దీంతో మందాకినీ నదీ ప్రవాహానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. పంజాబ్‌లో నదిలో ఎస్‌యూవీ కొట్టుకుపోవడంతో హిమాచల్‌కు చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 9 మంది ఒకే కుటుంబానికి చెందినవారు.

నిద్రపుచ్చే స్లీప్‌మేకర్స్!

- *చైనాలో ప్రాచుర్యంలోకి కొత్త వృత్తి!*
- *996 వర్క్ కల్చర్‌తో యువత చిత్తు*
- *వైవాహిక ఒత్తిళ్లు, మానసిక, ఇతర సమస్యలతో నిద్ర కరువు*
- *వారి బాధలు విని, ఒత్తిడి పోగొట్టి నిద్రపోయేలా చేసే స్లీప్‌మేకర్స్*



బీజింగ్: 'నిదానమే ప్రధానం' అనుకునే రోజులు కావివి. ఏ రంగంలో చూసినా విపరీతమైన పోటీ. దానిని అందుకోవాలంటే పరుగులు పెడుతూనే ఉండాలి. అయితే, ఇలా నిత్యం పరుగులు పెట్టే జీవనం ఎన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నది. సరిగ్గా ఇదే జరుగుతున్నది చైనాలో. అక్కడ పుట్టుకొచ్చిన '996 వర్క్ కల్చర్' (వారంలో ఆరు రోజులు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు పనిచేయడం) యువతను నిద్రకు దూరం చేస్తున్నది. వెంటాడే మానసిక సమస్యలు.. వైవాహిక ఒత్తిడి, నిత్య జీవితంలో ఒత్తిళ్లు.. ఎవరికి చెప్పుకోవాలో తెలియక వేదన అనుభవిస్తూ నిద్రకు దూరమవుతున్నారు. అయితే, ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో మానసిక ఒత్తిడిని పోగొట్టి జోలపాడి హాయిగా నిద్రపుచ్చేందుకు ఓ కొత్తరకం వృత్తి ఇప్పుడక్కడ పుట్టుకొచ్చింది. అదే 'స్లీప్ మేకర్స్'.

గంటకు రూ.3 వేలు

ఒత్తిడి ఎదుర్కొంటూ నిద్రకు దూరమవుతున్న వారికి స్లీప్ మేకర్స్ ఎమోషనల్‌గా సపోర్ట్ అందిస్తారు. వారి బాధలు వింటారు. ముచ్చట్లాడుతూ వారిలోని ఆందోళనను దూరం చేస్తారు. ఫలితంగా వారు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. ఇప్పుడీ సేవలు ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. స్లీప్‌మేకర్స్ గంటకు 260 యువాన్లు (దాదాపు రూ.3 వేలు) వసూలు చేస్తున్నారు. 996 వర్క్ కల్చర్ కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిలో ఎక్కువమంది యువతే కావడం గమనార్హం. వీరు తమ బాధలను స్లీప్‌మేకర్స్‌తో చెప్పుకుంటూ సేద దీరుతుంటారు. ఇలాంటి సేవలు అందించే వాటిలో 'సెవెన్ సెవెన్7' అనే సంస్థ పాపులర్ అయింది. ఇది ఊహాత్మక బెడ్‌టైం స్టోరీలు చెప్తూ క్లయింట్స్‌ను ఆకర్షిస్తున్నది. ఇప్పుడీ వృత్తిని చాలామంది పార్ట్‌టైంగానూ ఎంచుకుంటూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. సాధారణంగా వ్యక్తిగత సమస్యలను స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకోవడానికి చాలామంది ఇష్టపడరు. వాటిని తమలో తామే దాచుకుని మథనపడుతూ నిద్రకు దూరమవుతుంటారు. ఇలాంటి వారికి ఈ స్లీప్‌మేకర్స్ చక్కని ఔషధంలా పనికొస్తున్నారు. తమ సమస్యలను వారి ముందు వెళ్లబోసుకుని గుండెలోని భారాన్ని అమాంతం దింపేసుకుంటూ హాయిగా నిద్రపోతున్నారు.



బంగాళదుంపలతో గుండె పదిలం!

న్యూఢిల్లీ, ఆగస్టు 11: బంగాళదుంపలు ఆరోగ్యానికి హాని చేస్తాయని చాలామంది భావిస్తారు. అందుకనే వాటికి దూరంగా ఉంటారు. అయితే, ఇప్పుడా అభిప్రాయాన్ని మార్చుకోక తప్పదు. టైప్-2 డయాబెటిస్‌తో బాధపడుతున్న వారి ఆహారంలో బంగాళదుంపలు గేమ్ చేంజర్ అవుతాయని, గుండె ఆరోగ్యాన్ని కూడా ఇవి మెరుగుపరుస్తాయని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. నిజానికి బంగాళదుంపల్లో పెద్దమొత్తంలో కార్బోహైడ్రేట్లు ఉంటాయని చెప్తుంటారు. అయితే ఇవి పోషకాలకు పవర్‌హౌస్ లాంటివని, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయని, నడుము చుట్టుకొలతను తగ్గించే శక్తి కూడా వీటికి ఉన్నదని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఆలుగడ్డల్లో ఖనిజాలు కూడా సమృద్ధిగా ఉంటాయి.

5 కిలోల ఆలుగడ్డలు లంచం.. ఎస్‌ఐ సస్పెన్షన్!

లక్నో, ఆగస్టు 11: యూపీలో ఒక పోలీస్ అధికారి ఒక రైతు నుంచి ఐదు కిలోల ఆలుగడ్డలు లంచంగా అడిగి సస్పెండ్ అయ్యాడు. అతడు రైతును ఐదు కిలోల ఆలుగడ్డ లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా, అంత ఇచ్చుకోలేనని రైతు అనడంతో చివరకు బేరం మూడు కిలోలకు కుదిరింది. ఈ సంభాషణ ఆడియో వైరల్ కావడంతో అధికారులు లంచం అడిగిన కన్నౌజ్ జిల్లా సౌరిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రామ్‌కృపాల్ సింగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఆలుగడ్డ అని ఎస్‌ఐ వాడినది కోడ్ వర్డ్ అని, బహుశా 5 కేజీలు అంటే రూ.5 వేలు, లేదా రూ.5 లక్షలు కావచ్చునని కన్నౌజ్ ఏసీపీ తెలిపారు.

• ఏపీ సీఎంను కలిసిన తెలంగాణ స్పీకర్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆదివారం తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వసతి, దర్శనానికి సంబంధించి తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలకు అర్హత కల్పించాలని ఆయన బాబును కోరారు.

– వికారాబాద్

తెలంగాణ ఎన్నారైలకు అవమానం

- సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో అంతా ఏపీ ఎన్నారైలు, టీడీపీ నేతలే
- కలిసేందుకూ తెలంగాణ ఎన్నారైలకు అవకాశం ఇవ్వని రేవంత్
- బాధతో సోషల్ మీడియాలో పోస్టులు
- ఎంవోయూలపై ఈడీ విచారణకు డిమాండ్
- రేవంత్ పర్యటనలో అంతా 'ఆయనే'
- స్వచ్ఛబయో ఒప్పందంలోనూ కీలకం



అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై అక్కడి తెలంగాణ ఎన్నారైలు, టీకాంగ్రెస్ అభిమానులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సీఎంగా అమెరికా పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ఎన్నారైలు, కాంగ్రెస్ అభిమానులను తప్ప మిగతా అందర్నీ పట్టించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఆవేదనను వెల్లడిస్తున్నారు. మిషన్ తెలంగాణ, ఫ్రెండ్స్ ఆఫ్ కాంగ్రెస్ యూఎస్‌ఏ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్టులతో విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎంగా తొలిసారి అమెరికాకు వచ్చిన రేవంత్‌రెడ్డిని ఆహ్వానించేందుకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కొన్ని సంస్థల ప్రతినిధులు శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా ఎయిర్‌పోర్టుకు వెళ్లగా వారిని బయటే నిలబెట్టి, అవమానించారంటూ మిషన్ తెలంగాణలో పోస్ట్ చేశారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వంటి పలు సంస్థల ప్రతినిధులనూ లోనికి అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చంద్రబాబు మద్దతుదారులు, ఏపీకి చెందినవారికి రేవంత్ అధిక ప్రాధాన్యం ఇచ్చారంటూ తెలంగాణ ఎన్నారైలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎంను ఆహ్వానించటానికి వెళ్లినవారిలో ఒక్క ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మినహాయిస్తే మిగిలిన 95 శాతం మంది ఏపీ, టీడీపీవాళ్లేనని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఎంతో దూరం నుంచి ఎయిర్‌పోర్టుకు వచ్చిన తమకు కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని, కానీ ఏపీ ఎన్నారైలు సులువుగా కలుసుకోగలిగారంటూ ఎన్నారై సతీశ్ పసుపులేటి ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనలు, సెక్యూరిటీ పేరుతో తమను దూరం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, టీడీపీనేతలే కాదు.. కర్ణాటక నేతలు కూడా కొందరు సీఎం రేవంత్‌రెడ్డిని కలవటం గమనార్హం. కర్ణాటక నేతలను కూడా కలిసేందుకు ఇష్టపడ్డ సీఎం.. తెలంగాణ కోసం కొట్లాడిన, తెలంగాణవాదులైన తమను కలిసేందుకు ఇష్టపడటం లేదని తెలంగాణ ఎన్నారైలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పెట్టుబడులపై విచారణ జరిపించాలి

అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బృందం చేసుకుంటున్న ఎంవోయూలపై విచారణ జరిపించాలని ఫ్రెండ్స్ ఆఫ్ కాంగ్రెస్ యూఎస్‌ఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాహుల్‌గాంధీకి ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేసింది. వెబ్‌సైట్ కూడా లేని కంపెనీతో ఒప్పందం చేసుకోవటం ఏమిటి? అని ప్రశ్నించారు. ఎలాంటి పేరు ప్రఖ్యాతులు లేని సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడి కంపెనీతో ఒప్పందం చేసుకోవటాన్ని కూడా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను టీడీపీ, ఇతర ప్రాంతాల ఎన్నారైలే నడిపిస్తున్నారని ఆరోపించారు. ఎంవోయూల్లో కుటుంబ కంపెనీల భాగస్వామ్యం లేకుండా చూడాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. ఎంవోయూలపై త్వరలోనే ఈడీ విచారణ కోరుతామని పేర్కొన్నారు.

అంతా 'ఆయనే'..?

తెలంగాణకు చెందిన కాంగ్రెస్ అనుకూల మీడియా ప్రతినిధి సీఎం అమెరికా పర్యటనలో అంతా తానై వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. స్వచ్ఛబయో కంపెనీతో ఒప్పందంలో ఆయనదే కీలక పాత్ర అని తెలిసింది. కొన్ని ఎంవోయూల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. హర్ష పసునూరి, జగదీశ్వర్‌రెడ్డితో కలిసి స్వచ్ఛబయో ఏర్పాటులో ఆ వ్యక్తి కీలకంగా ఉన్నారని తెలిసింది.



అడవిదేవులపల్లి మండలం చిట్యాలలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న గ్రామస్థులు

మంత్రి ఉత్తమ్ కాన్వాయ్ అడ్డగింత

అడవిదేవులపల్లి, ఆగస్టు 11 : తమకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టెయిల్‌పాండ్ నిర్వాసితులు, గ్రామస్థులు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాన్వాయ్‌ని ఆదివారం అడ్డుకున్నారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ పనులను పరిశీలించడానికి నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌పాటి, ఎన్నెస్పీ చీఫ్ ఇంజినీర్ అనిల్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కాన్వాయ్‌ని వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారిని తప్పించే ప్రయత్నం చేయగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకున్నది. తమకు తాగునీరు రావడం లేదని, ఇండ్లల్లోకి పాములు, తేళ్లు వస్తున్నాయని నిర్వాసితులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రిని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): వయనాడ్ ముంపు ప్రాంతాలను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దాదాపు 416 మంది ప్రాణ నష్టం జరిగిందని, అందులో 47మంది సీపీఐ నాయకులను కోల్పోయినట్టు చెప్పారు. మృతి చెందిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.వయనాడ్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్శనలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయికుమార్, నాయకులు సాధిక్, అయ్యప్ప, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీకే మూర్తి, సీపీఐ వయనాడ్ జిల్లా కార్యదర్శి, ఐఏఎల్ రాష్ట్ర సభ్యుడు ఈ జే బాబు, ఏబీ చరియన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

- ఏఐ ఆధారిత డాటా సెంటర్‌పై మంత్రి దుద్దిళ్లతో చర్చలు
- బీఆర్‌ఎస్ హయాంలోనే పెరిగిన కంపెనీ కార్యకలాపాలు



మంత్రి శ్రీధర్‌బాబుతో అమెజాన్ వీపీ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డాటా సెంటర్‌ను విస్తరించేందుకు ముందుకొచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కంపెనీ వెబ్ సర్వీసెస్ డాటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. తెలంగాణలో డాటా సెంటర్ కార్యకలాపాలపై చర్చించారు. కాగా బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను భారీగా విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్‌కు చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్న విషయం విదితమే. గతేడాది అమెజాన్ డెడికేటెడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్'ను ప్రారంభించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు సంబంధించి హైదరాబాద్‌లో మూడు డాటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డాటా సెంటర్‌తో తమ వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలను కంపెనీ ప్రతినిధులు మంత్రితో పంచుకున్నారు.

చర్చలు విజయవంతం : శ్రీధర్‌బాబు

అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వం తరపున తగిన సహకారంతోపాటు ఉత్తమ ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్టు చెప్పారు.



పిచ్చికుక్కల దాడిలో గాయపడిన బాధితుడు

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు

- ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏడుగురిపై దాడి
- దవాఖానలో చికిత్స.. ముగ్గురి పరిస్థితి విషమం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 11: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో పిచ్చికుక్కలు రెచ్చిపోయాయి. అదే గ్రామానికి చెందిన ఏడుగురిపై ఆదివారం ఉదయం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. చేపూర్‌కు చెందిన వేల్పూల నర్సయ్య, కళ, పోసాని, లత, గంగారాం, భట్టు లాస్య, రాజగంగారాంపై ఉదయం 10.30 గంటలకు కుక్కలు ఒకదాని వెనుక మరోటి గుంపులుగా వచ్చి దాడి చేశాయి. దాడిలో గాయపడిన వారిని స్థానికులు ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నలుగురికి ఆర్మూర్ దవాఖానలో వైద్యం అందించగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా దవాఖానకు తరలించారు. కుక్కలు వెంటపడి ప్రజలపై దాడులు చేస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

నెమలి కూర వండటం ఎలా?

యూట్యూబ్‌లో వీడియో అప్‌లోడ్ • కటకటాల్లో యూట్యూబర్



నెమలి కూర వండుతున్నట్టుగా యూట్యూబర్ ప్రణయ్‌కుమార్ తీసిన వీడియోలోని చిత్రం

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): జాతీయ పక్షి నెమలి కూరను ఎలా వండాలో వివరించి కటకటాలు లెక్కపెడుతున్నాడు సిరిసిల్లకు చెందిన ఓ యూట్యూబర్. సిరిసిల్లలోని తంగళ్లపల్లికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్ సంప్రదాయ వంటకాలపై వీడియోలు చేసి శ్రీటీవీ అనే యూట్యూబ్ చానెల్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం సాంప్రదాయ పద్ధతిలో నెమలి కూర ఎలా వండాలో చూడండి అంటూ 'ట్రెడిషనల్ పీకాక్ కర్రీ రెసిపీ' అన్న పేరుతో యూట్యూబ్‌లో వీడియో అప్‌లోడ్ చేశాడు. దీనిపై జంతు ప్రేమికుల నుంచే కాకుండా సామాన్యుల నుంచి కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో వెంటనే స్పందించిన యూట్యూబ్ ఆ వీడియోను తొలగించింది. కానీ అప్పటికే ఓ 140 మందికి పైగా ఆ వీడియో చూశారు. అతడే నిషేధిత జాబితాలో ఉన్న అడవి పంది కూర ఎలా ఉండాలో కూడా వీడియో తీసి ఇంతకుముందు అప్‌లోడ్ చేశాడు. వన్యమృగాలను, జాతీయ పక్షిని వేటాడం నేరమని తెలిసి కూడా వాటిని చంపి కూర వండటమే కాకుండా.. ఆ వీడియోలను అప్‌లోడ్ చేయడంపై జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. ఈ విషయం తెలిసిన సిరిసిల్ల ఫారెస్ట్ అధికారులు ప్రణయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనుంచి నెమలికూర వీడియోను స్వాధీనం చేసుకున్నామని ఎఫ్‌ఆర్వో కల్పనాదేవి చెప్పారు. అతని వద్ద స్వాధీనం చేసుకున్న కూరను ల్యాబ్ టెస్ట్‌కు పంపించామని తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో రాఖీల డెలివరీ

- 24 గంటల్లో చేరవేత
- కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు
- 5 రోజుల ముందునుంచే సేవలు

హైదరాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): రాఖీ పండుగ సందర్భంగా కలిసి పండుగ చేసుకునే అవకాశం లేని తోబుట్టువుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నది. పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో కౌంటర్లు తెరిచి దూర ప్రాంతాల్లో ఉన్నవారికి రాఖీలు సులభంగా పంపే వీలుకల్పిస్తున్నది. రాఖీలతోపాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పిస్తున్నది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలు పంపించుకునే సదుపాయం కల్పిస్తున్నది. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు.

బిడ్డలను కాపాడబోయి..

- రైలు ఢీకొని తండ్రి, ఇద్దరు కూతుళ్ల దుర్మరణం
- గౌడవెల్లి స్టేషన్‌లో ప్రమాదం
- భార్య కళ్లెదుటే ఘోరం



భార్య కవిత(చీర కట్టుకున్న మహిళ), ఇద్దరు కూతుళ్లు వర్షిత, వరణితో కృష్ణ

మేడ్చల్, ఆగస్టు 11: రెప్పపాటులో ఘోరం జరిగింది. ఆదివారం కావడంతో ఆటవిడుపుగా వచ్చి ఆనందంగా గడుపుదామనుకున్న కుటుంబంలో అంతులేని విషాదం నిండింది. బిడ్డలను కాపాడబోయి తండ్రి సైతం రైలు ఢీకొని మృత్యువాతపడటం చూపరులను కలిచివేసింది. కళ్లెదుటే భర్త, ఇద్దరు కూతుళ్లు తునాతునకలు కావడంతో ఆ ఇల్లాలి రోదనకు అంతులేకుండాపోయింది. మేడ్చల్ మండలం గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన ఈ ఘటన రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన కృష్ణ(38) రైల్వే ఉద్యోగి. ఆయన గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో కీమాన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తన భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు వర్షిత(11), వరణి (5)ని తీసుకొని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. కృష్ణ రైల్వే ట్రాక్‌పై పనిచేస్తుండగా భార్యాబిడ్డలు ప్లాట్‌ఫాంపై ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత కృష్ణ ఒక ట్రాక్‌లో పనిచేస్తుండగా ఇద్దరు బిడ్డలు మరో ట్రాక్‌లోకి ఆడుకునేందుకు వచ్చారు. అదేసమయంలో నాందేడ్ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ గౌడవెల్లికి చేరువగా వచ్చింది. తాము ఉన్న ట్రాక్ పైనుంచే రైలు వస్తున్నట్టు పిల్లలు గర్తించలేదు. కృష్ణ కూడా పనిలోపడి దగ్గరికి వచ్చేదాకా గుర్తించలేదు. రైలు సమీపిస్తున్న సమయంలో గుర్తించి వేగంగా కదిలి పిల్లలను ట్రాక్ నుంచి పక్కకు తప్పించే ప్రయత్నంలో రెప్పపాటులో ముగ్గుర్నీ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లల చేతులు, కాళ్లు తెగిపడగా, కృష్ణ ముఖం, అవయవాలు చితికిపోయి గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయ్యాడు. ఈ ఘటన ప్లాట్‌ఫాంపై ఉన్న కవిత కళ్లెదుటే జరగడంతో ఆమె ఒక్కసారిగా షాక్ గురైంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలపై పులి దాడి!

కెరమెరి, ఆగస్టు 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి గ్రామంలో శనివారం రాత్రి పులి కుక్కలపై దాడిచేసింది. ఓ గుడిసెలో గొలుసులతో శునకాలను కట్టేసి ఉంచగా చంపేసింది. ఒకదాన్ని సగం వరకు తిని వదిలేసి వెళ్లింది. విషయం తెలుసుకున్న కెరమెరి ఎఫ్‌ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ సిబ్బందితో ఆ గ్రామానిక చేరుకొని కుక్కల కళేబరాలు, పులి అడుగులను పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన తర్వాత పులి దాడి చేసిందో లేదో నిర్ధారిస్తామని తెలిపారు. ఏదిఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.



బీసీ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

బీసీలు సంఘటితమైతేనే రాజ్యాధికారం

బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం

ఖైరతాబాద్, ఆగస్టు 11: బీసీలు సంఘటితమైతేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని మాద్రన్ ఫంక్షన్‌హాల్‌లో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. బీసీలు ఐక్యమైతే సాధించలేనిది ఏదీ ఉండదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో బీసీ నేతలు శాంతికుమార్, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, తమ్మురు శ్రీరాములు, కోరే రాజ్‌కుమార్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని బలి తీసుకున్న పోకిరీలు

- రోడ్డుపక్కన దూసుకొచ్చిన కారు
- మద్యం మత్తు, అతివేగంతో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి
- జీడిమెట్ల పీఎస్ పరిధిలో దుర్ఘటన

కుత్బుల్లాపూర్, ఆగస్టు11: రోడ్డుపక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడు పోకిరీల కారణంగా బలయ్యాడు. అతిగా మద్యం తాగి, రాత్రంతా నగరాన్ని చుట్టేందుకు కారులో వెళ్తూ.. నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుత్బుల్లాపూర్‌కు చెందిన కూన మనీశ్‌గౌడ్ శనివారం రాత్రి మరో ఐదుగురు స్నేహితులతో కలిసి మద్యం తాగారు. మత్తులోనే రాత్రంతా నగరాన్ని చుట్టేందుకు టీఎస్10ఈఈ600 నంబర్ గల మహేంద్ర ఎక్స్‌యూవీ 500 వాహనంలో వెళ్లారు. వాహనాన్ని మనీశ్‌గౌడ్ నడుపుతుండగా స్నేహితులు అదే కారులో ఉన్నారు. ఉదయం నిజాంపేట నుంచి దేవేందర్‌నగర్ మూలమలుపు వద్దకు రాగానే రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న గాజులరామారం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన భాషా గోపి(38)ని కారు ఢీకొని 10 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీంతో గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే కారులో ఉన్న మిగతా యువకులు తప్పించుకొని పారిపోగా, డ్రైవింగ్ సీటులో ఉన్న మనీశ్‌ను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. కొండపై ఉన్న 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయి అతిథి గెస్ట్‌హౌజ్ వరకు క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. శనివారం 73,313 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 39,344 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు సమకూరినట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా తిరుమలలో ఈ నెల 15 నుంచి 17 వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 14న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

• జాలువారుతున్న 'మహితాపురం'



ములుగు జిల్లా వాజేడు మండలంలోని మహితాపురం వాటర్ ఫాల్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. జలపాతంలో ఆటలాడుతూ పర్యాటకులు సందడి చేస్తున్నారు.

షూలో దాచి తెచ్చిన కోటిన్నర బంగారం పట్టివేత



షూలో దాచి తెచ్చిన బంగారం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 11: షూలో దాచి తీసుకొస్తున్న రూ.కోటి విలువైన బంగారాన్ని ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి ఈకే-528 నంబర్ విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడు శంషాబాద్‌లో దిగగానే వారు తనిఖీ చేశారు. బూట్లు, ఇతర సామాన్లు ఉన్న బ్యాగును అధికారులు స్కాన్ చేయగా దానిలో కిలోన్నర బంగారం బయటపడింది. బ్యాటరీ ఆకారంలో ఉన్న రెండు పసుపు రంగు పెద్ద మెటల్ బార్లను ఎడమకాలి షూలో దాచి తెచ్చినట్టు వారు గుర్తించారు. అతని నుంచి 1390.850 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ 1.6 కోట్ల వరకు ఉంటుందని, నిందితుడిపై కస్టమ్స్ యాక్ట్ 1962 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

శ్రీశైలం దారుల్లో ప్లాస్టిక్ నిషేధం కట్టుదిట్టం

- మూడు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు
- పర్యాటకుల నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ
- జూలై 1 నుంచి 6 వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం దారుల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం కట్టుదిట్టంగా అమలవుతున్నది. జూలై 1 నుంచి ఇప్పటి వరకు 6 వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీశాఖ సేకరించింది. రోజూ దాదాపు 40 నుంచి 50 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను మూడు చెక్‌పోస్టుల వద్ద సేకరిస్తున్నారు. ఉమామహేశ్వరం చెక్‌పోస్టు వద్ద వాహనాల రాకపోకలు తక్కువ. మన్ననూర్, దోమలపెంట నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ చెక్‌పోస్టుల మీదుగా సగటున 1,000 వాహనాలు వెళ్తుండగా, వారాంతాల్లో 3,500 వరకు వస్తుంటాయి. సందర్శకులు ఎటువంటి ప్లాస్టిక్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్లను తీసుకెళ్లకుండా చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు 16 మంది స్థానిక చెంచు గిరిజనులను అటవీశాఖ నియమించింది. ఒక్కో చెంచు మూడు కిలోమీటర్ల మేర వ్యర్థాలను సేకరిస్తున్నారని, ఆ తర్వాత రవాణా వాహనం వాటి నుంచి వ్యర్థాలను తీసుకెళ్తుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను మన్ననూర్‌లోని బెయిలింగ్ యూనిట్‌కు తరలిస్తున్నారు. ఒక లీటర్ బాటిళ్లపై అటవీశాఖ కఠినమైన నిషేధం విధించడంతో, సందర్శకులు రెండు లీటర్లు, ఐదు లీటర్ల బాటిళ్లను తెచ్చుకొని రోడ్లపై పడేస్తున్నారు. సందర్శకుల సౌకర్యార్థం అటవీశాఖ మన్ననూర్‌లో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.